




# విజయభాను

40 Years of Excellence విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాఖపట్నం, గురువారం 03-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 322 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## రెపో రేటు తగ్గుదల



- తగ్గించిన ఆర్బీఐ
- ద్రవ్యపరపతి సమీక్షలో నిర్ణయం
- ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్

ముంబై: వడ్డీరేట్లతోపాటు పలు అంశాలపై ఇవాళ ఆర్బీఐ కీలక ప్రకటన చేసింది. రెపో రేటును ఆర్బీఐ 0.25 తగ్గించింది. ఇవాళ జరిగిన ద్రవ్యపరపతి సమీక్షలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. రెపో రేటును 6.25 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ ప్రటించింది. సీఆర్‌ఆర్‌ను నాలుగు శాతంగానే ఉంచింది ఆర్బీఐ. రివర్స్ రెపో రేటును 6 శాతం నుంచి 5.75 శాతానికి తగ్గించారు. ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ వడ్డీ రేట్లకు సంబంధించి ప్రకటన చేశారు. జీఎస్టీ అమలు, సరైన రుతుపవనాల వల్లగడిచిన మూడు నెలల్లో ద్రవ్యోల్బణం తగ్గిందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలను ఉర్జిత్ పటేల్ బుధవారం వెల్లడించారు. పరపతి సమీక్షలో కీలక వడ్డీ తరువాయి 2లో

## కర్ణాటకలో ఐటీ సోదాలు



- కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ ఇంట్లో
- రూ.7.5కోట్లు సీజ్
- ఈగల్‌టన్ రిసార్ట్‌లో సోదాలు
- పన్ను ఎగవేత కేసులో దాడులు ముమ్మరం

బెంగళూరు: కర్ణాటక మంత్రి డీకే శివకుమార్‌కు చెందిన నివాసం, కార్యాలయాల్లో ఐటీశాఖ బుధవారం సోదాలు చేపట్టింది. ఈ తనిఖీల్లో రూ.7.5కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఐటీ అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం ఏకకాలంలో 39 ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. తరువాయి 2లో

## బ్యాంకు సబ్సిడీ వినియోగించుకోవాలి

- రుణాలను సద్వినియోగం చేసుకోండి
- సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభాలు
- స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు



విజయవాడః ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు తదితర కార్పోరేషన్ల ద్వారా ప్రభుత్వం అందించే సబ్సీడీతో పాటుగా స్థానిక బ్యాంకులు అందించే రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని నిరుద్యోగులు ఆర్థికంగా ఎదగాలని శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం రాజుపాలెం మండల కార్యాలయాల వద్ద వివిధ కార్పోరేషన్ల రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సభాపతి డాక్టర్ కోడెల ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 145 మంది లబ్దిదారులకు 2 కోట్ల 4 లక్షల రూపాయిల చెక్కులను సభాపతి చేతులమీదుగా పంపిణీ చేశారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి ఇతరులు రుణాన్ని పొందేందుకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. బ్యాంకర్లు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో వాస్తవ లబ్దిదారులకు ఇబ్బంది కలుగజేయకూడదని సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లితండ్రులకు సూచించారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో 160 అంగన్ వాడీ కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలనుండి కృష్ణా నదికి నీటి లభ్యత తక్కువగా ఉండడం వలన నాగార్జునసాగర్ నుండి సాగు జలాలు రావడం కష్టంగా ఉందని, సేద్యపు నీటి కుంటలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను పరిరక్షించుకోవాలని రైతులకు సూచించారు. ముందుగా గ్రామంలో సీసీ రోడ్డును సభాపతి ప్రారంభించి మరో సీసీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు తరువాయి 2లో

## ఐటీ సోదాలపై రాజ్యసభలో ఆందోళన



దిల్లీ: కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ నివాసంతో పాటు బెంగళూరులో ఉన్న గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల గదుల్లో ఐటీ శాఖ సోదాలు చేయడంపై రాజ్యసభ అట్టుడికింది. రాజ్యసభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. ఛైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిప్యూటీ ఛైర్మన్ కురియన్ సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించొద్దని కోరినా వారు వినిపించుకోలేదు. దీంతో సభను వాయిదా వేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్‌శర్మ మాట్లాడుతూ.. కర్ణాటక మంత్రి, ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకునే ఐటీ దాడులు చేయించారని ఆరోపించారు. ప్రతిపక్షాల మీద దాడులు చేయిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

## స్కూలు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా



అనకాపల్లిః కశింకోట మండలంలో తేగాడ గ్రామంలో గల మోడల్ స్కూలును బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూలు ప్రహారీ గోడ నిర్మాణానికి 2.50 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే స్కూలు అభివృద్ధికి చర్యలు తీసకుంటామన్నారు. అలాగే కస్తూరిభా పాఠశాల ప్రహారీ గోడకు నిధులు మంజూరుకి కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్ధులతో సమావేశమయ్యారు. విద్యార్ధులు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత, లాలం భాస్కర్, ఎఎంసి ఛైర్మన్ కాయలమురళీధర్, మాజీ ఎంపిపి పెంటకోట సుబ్బలక్ష్మి, ఆర్డీవో సూర్యకళ, ఎంపిడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో లాలూ నిజస్వరూపం




పట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, భాజపా నేత సుశీల్ కుమార్ మోదీ మధ్య మాటల యుద్ధం గురించి తెలిసిందే. భాజపా.. జేడీయూతో పొత్తు పెట్టుకోకముందు అనేక సార్లు లాలూ, ఆయన కుమారులపై ఆరోపణలు చేసి తరువాయి 2లో






## టికెట్-ఈజీ



ప్రజా సేవ చేశాను...
ప్రజల అభిమానం
మెండుగా ఉంది అంటే
కుదరదోయ్...
టిక్కెట్ కావాలంటే బ్లాక్ మనీ
ఎంతుందో చెప్పు !

## స్వచ్ఛ విశాఖ లక్ష్యం కావాలి

- ఆధునిక పరికరాలు వినియోగం
- జిల్లా కలెక్టర్ మరియు జివియంసి ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

విశాఖ సిటీ: జివియంసి పరిధిలో పారిశుధ్య నిర్వహణకు మరియు మలేరియా వ్యాధి నివారణకు ఈ పరికరాలు ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ మరియు జివియంసి ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. 3 లక్షల వ్యయంతో బ్యాక్ ప్యాక్ మిస్ట్ స్ప్రేయర్స్ 10, 2.5 లక్షల వ్యయంతో మ్యానువల్ స్వీపర్స్ 20,7 లక్షల వ్యయంతో కార్డ్‌లెస్ బ్రెష్ కట్టర్స్ 8, 2 లక్షల వ్యయంతో బ్యాటరీ ఆపరేటెడ్ స్వీపర్స్ 2 కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆధునిక పరికరాలు వినియోగించడం ద్వారా మరింత స్వచ్ఛతకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కమిషనర్ హరినారా యణన్ మాట్లాడుతూ తరువాయి 2లో



పారిశుధ్య నిర్వహణకు సిబ్బందికి నూతన యంత్రాలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జివియంసి ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

# ఎల్ఇడి బల్బులతో విద్యుత్ ఆదా అవుతుంది

## మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు

సబ్బవరం: ఎల్ఇడి బల్బులతో విద్యుత్ ఆదా అవుతుందని కరెంట్ ఖర్చు కూడా తగ్గుతుందని మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలోని పంచాయితీ కార్యాలయంలో బుధవారం ఆర్ఇసిఎస్ ఉచితంగా ఇచ్చిన ఎల్ఇడి బల్బులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు ఎం.మహలక్ష్మినాయుడు, సర్పంచ్ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొని వారి చేతుల మీదుగా ఎల్ఇడి బల్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు ఎం.మహలక్ష్మి నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ఇస్తుందని అన్నారు. ఒక్క విద్యుత్ మీటరుకు రెండు ఎల్ఇడి బల్బులు చొప్పున పంపిణీ చేశారు. ఆర్ఇసిఎస్ వారు ఉచితంగా ఇచ్చిన ఎల్ఇడి బల్బులను వినియోగించుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజకవర్గానికి ఎంతో శ్రమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్ఇసిఎస్ డైరక్టర్ సబ్బవరపు నారాయణమూర్తి, వార్డు మెంబర్లు గొర్లి చినరామునాయుడు, బోకం శ్రీనువాసరావు, వెన్నల స్వామి, గొర్లి ఎర్రినాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, సబ్బవరపు గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఇడి బల్బులు పంపిణీ చేసిన టీడీపీ అధ్యక్షుడు ఎం.మహలక్ష్మినాయుడు

## ఈనెల 3, 4 శుక్రవారాల్లో

# సింహాద్రిపై సామూహిక వరలక్ష్మీవ్రతాలు

సింహాచలం : రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలమేరకు శుక్రవారం సింహగిరిపై నృసింహమండపంలో శ్రావణలక్ష్మి పేరుతో సామూహిక జరుగనున్నట్లు ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. స్వామివారి చెంతన ఉన్న నృసింహ మండపంలో మూడవ శుక్రవారం అంటే తేదీ 11-08-17న, నాలగవ శుక్రవారం తేదీ 18-08-17న సామూహిక వరలక్ష్మీవ్రతాలు జరుపనున్నట్లు అధికారులు తెలిపారు. పూజల్లో పాల్గొన దలచిన మహిళలు రాగి లేదా ఇత్తడి చిన్న కలశ చెంబు తెచ్చుకొనవలెను. దేవస్థానం వారు పసుపు, కుంకుమ, రవిక మెదలగు పూజా సామగ్రి, గాజులు, పులిహోర, లడ్డు ప్రసాదము, కొండకింద నుండి కొండపైకి, కొండపై నుండి కొండక్రిందకు ఉచిత బస్సుప్రయాణము సౌకర్యం, ఉచిత అన్న ప్రసాదము దేవస్థానంవారు ఉచితంగా అందిస్తామని తెలిపారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారంగా ఆధ్యాత్మిక కార్యక్రమం జరిపించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చక స్వాములు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు, వైదిక పెద్దలు తెలిపారు.

వ్రతంలో భాగంగా కుంకుమపూజలు, క్షీరాభిషేకం, లలితా సహస్ర పారా యణం, శ్రీచక్ర పూజలు, అమ్మవారికి ప్రత్యేక పూజ వంటి కార్యక్రమాల అనంతరం వరలక్ష్మి వ్రతవిశిష్టత వివరిస్తారు. సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గోన్న మహిళలు వివరాల కోసం కొండపైన ఉన్న సమాచార కేంద్రంలో అడిగి తెలుసుకొనచ్చును అని అధికారులు తెలిపారు.

# శ్రాద్ధ కర్మభవనానికి శంకుస్థాపన



రావులపాలెం: మరణించిన వ్యక్తుల యొక్క శ్రాద్ధకర్మలు నిర్వర్తించేందుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పెద్దకాలువను ఆనుకొని పెద్దలు సహకారంతో పక్కా భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసారు. గ్రామ ప్రజలు అవసరార్థం అనువైన ప్రదేశంలేక ఇప్పటివరకు అనేక ఇబ్బందులు ఉన్న దృష్ట్యా గ్రామపెద్దల సహకారంతో ప్రస్తుత పాలకవర్గం పక్కాభవనం నిర్మించేందుకు పూనుకున్నట్లు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి జగన్నాధరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ గొలుగూరి వెంకటరెడ్డి, చాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కళలకు ప్రాధాన్యం కల్పించాలి

## వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు



విశాఖపట్నం : భారతీయ కళలకు పూర్తిస్థాయిలో ప్రాధాన్యం, ప్రాచుర్యం కల్పించే దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం పనిచేస్తోందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు అన్నారు. బుధవారం సాయంత్రం ఏయూ టిఎల్ఎన్ సభామందిరంలో జాతీయ నాట్య విద్యాలయం(ఎన్ఎస్డి), నాట్యసుధ, ఏయూ సంయుక్తంగా నిర్వహించిన నటశిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏపి, తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, హరిద్వార్ తదితర ప్రాంతాలకు చెందిన 25 మంది ఆసక్తి కలిగిన వారికి శిక్షణకు హాజరయ్యారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరబద్రరావు, పైడా క్రిష్ణ ప్రసాద్, చలసాని జయప్రద,ఎస్ఎస్డి ఆచార్యుల ఎం.కె రైనా తదితరులు పాల్గొన్నారు.

# సర్వేజనా సుఖినోభవంతు

## లోక కళ్యాణార్థమై రావులపాలెంలో వేద పారాయణం



రావులపాలెం : రావులపాలెంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో టిటిడి వేదపండితులచే లోకకళ్యాణార్థం వేదపారాయణ కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి వేదపారాయణ స్కీమ్ సూపర్వైజర్ గుళ్లపల్లి ఆంజనేయ ఘనాపాఠి మాట్లాడుతూ సర్వజనుల హితంకోరి, లోకకళ్యాణార్థం, గోసంరక్షణార్థం, టిటిడి వేదపండితులుచే వేదపారాయణలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు వేదపండితులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాటికి

## 1.25 లక్షల మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి

పార్వతీపురం: గాంధీ జయంతి అక్టోబరు 2 నాటికి 1.25 లక్షల మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ మండల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అక్టోబర్ 2 నాటికి 1.25 లక్షల మరుగుదొడ్ల నిర్మాణ కార్యాచరణపై సీతానగరం, బొబ్బిలి, పార్వతీపురం మండలాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ కింద జిల్లాలోని 330 గ్రామ పంచాయితీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5 నాటికి కార్యాచరణ ప్రణాళిక పూర్తి కావాలని, గ్రామ పంచాయితీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులను ఆధార్‌కార్డు, రేషన్ కార్డుతో స్వీకరించి ఆన్‌లైన్లలో నమోదు చేసి అర్హులైన వారికి గ్రామ ప్రత్యేకాధికారులు, సర్పంచ్, గ్రామస్థాయి అధికారులు గుర్తించాలన్నారు. ఈనెల 10 నాటికి మరుగుదొడ్ల నిర్మాణానికి మార్కింగ్, ఫిట్టింగ్, శ్రీనిధి రుణాలు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు ప్రారంభించడానికి డాక్యుమెంటేషన్, మెటీరియల్, లేబరు తదితర పనులు పూర్తి చేసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల పనులు నాణ్యతతో నిర్మించాలన్నారు. ముందుగా కలెక్టర్ సీతానగరం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒలు జి.శంకరరావు, తహశీల్దారు ఎం.అప్పారావు, బొబ్బిలి ఎంపిడిఒ త్రినాధరావు, మండలాధికారులు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శిలతో మండలాల్లో మరుగుదొడ్ల నిర్మాణ కార్యాచరణపై చర్చించారు. బొబ్బిలిలో నిర్ధేశించిన 3333, సీతానగరంలో 3896 మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. పార్వతీపురం గిరిమిత్ర సమావేశం మందిరంలో ఐటిడిఎ పి.ఒ. డా. జి.లక్ష్మీశతో కలిసి మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. పార్వతీపురం గిరిమిత్ర సమావేశం మందిరంలో ఐటిడిఎ పి.ఓ.డా.జి.లక్ష్మీశతో కలసి మరుగుదొడ్ల నిర్మాణాలపై కలక్టర్ వివేక్ యాదవ్ సమీక్షించారు. పార్వతీపురం మండలంనకు నిర్దేశించిన 3896 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంపై ఎంపిడిఓ కృష్ణారావు, తహశీల్దారు రఫీ, ఐటిడిఎ ఎ.పి.ఓ. ప్రభాకరరావు, ఐటిడిఎ అధికారులు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు, పంచాయితీ సెక్రటరీలతో చర్చించారు. గుర్తించిన మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి క్షేత్ర సాంకేతిక అధికారులు ఆన్‌లైన్‌లో అఫ్‌లోడ్ చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి శత శాతం లక్ష్య సాధనకు గుర్తించిన లబ్దిదారులకు ధృవ పత్రాలు ఈ నెల 5 లోగా అందించాలన్నారు. కొమరాడ మండలంలో వైడి నెట్ వర్కు వారు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి అడ్వాన్సులు తీసుకొని నిర్మాణాలు చేపట్టకపోవడంపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని, ఎంపిడిఓ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, పాత్రికేయుల అడిగిన ప్రశ్నకు కలక్టరు చెప్పారు. అలాగే కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని వి.ఆర్.ఓ జారీ చేసే సీఓసి ధృవపత్రం ఆధారంగా బ్యాంకు రుణాలు ఇవ్వాలని కలక్టర్‌ని కోరగా, కలక్టర్ స్పందించి బ్యాంకర్లకు తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. పార్వతీపురం డివిజన్‌లో జిల్లా కలక్టర్ విస్తృత పర్యటనలో సీతానగరం, పార్వతీపురం మండలాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల పనులను క్షేత్ర స్థాయిలో కలక్టర్ పరిశీలించారు. ముందుగా సీతానగరం మండలం పెదలోగిలి గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ అనుసంధానం నిధులతో నిర్మించిన వర్మికాంపోస్ట్ యూనిట్‌ను కలక్టరు వివేక్ యదవ్ పరిశీలించారు. ఇక్కడ తయారైన వర్మికాంపోస్ట్‌ను నంది వర్మికాంపోస్ట్ పేరుతో రైతులకు 50 కేజీ గల ఒక్కో ఒస్తా సంచి రూ.750 లకు సమకూర్చుతున్నారు. వర్మికాంపోస్ట్ యూనిట్ నిర్వహణపై కలక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పార్వతీపురంలోని మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులందరూ ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ పథకాల లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG ...ahead

SHORT TENDER NOTICE

1.Tender Notice No : Rc.No.351/2017-F1/Bheemili Zone
2.No.of Work and period : Supply of 2 Nos. of TATA Ace Vehicles for Sanitation work (including driver and fuel charges) i.e. from 20.08.2017 to 31.03.2018 (7 months & 10 days)
3 Value of work : Rs.9,40,800/- (approximately)
4. Last date of receipt of application and issue of tender schedule upto : 03-08-2017 to 11-08-2017 upto 3.00 PM
5.Tender opening date and time : 17-08-2017 at 04.30 PM

The interested Parties can obtain the further information if any and purchase of Tender Schedule in all working hours and days from Zonal Commissioner,Bheemunipatnam Zone, GVMC office.The terms and conditions are according to details in Tender Schedule.

For COMMISSIONER

స్వచ్ఛ ఆంధ్ర — స్వచ్ఛ విశాఖ

స్వచ్ఛ విశాఖ మన లక్ష్యం – స్వచ్ఛ ఆంధ్ర మన గమ్యం

మొదటి పేజీ తరువాయి

## త్వరలో లాలూ నిజస్వరూపం

వార్తల్లో నిలిచారు. తాజాగా నితీశ్ మహాకూటమికి గుడ్‌బై చెప్పి.. భాజపాతో చేతులు కలపడంతో సుశీల్ ఉపముఖ్యమంత్రి పదవిలోకి వచ్చారు. తాజాగా మరోసారి ఆయన లాలూపై ఆరోపణలకు దిగారు. మూడు రోజుల్లో లాలూ నిజస్వరూపం బయటపెడతా అంటూ హెచ్చరికలు చేశారు. అయితే ఈసారి ఆయన నితీశ్ టీంలో ఉండి ఈ వ్యాఖ్యలు చేయడంతో చర్చనీయాంశంగా మారింది.

బిహార్ ఇసుక మాఫియాలో లాలూ, ఆయన కుటుంబం అక్రమాలను బయటపెడతానని సుశిల్ అన్నారు. ఈ మేరకు ఇసుక కుంభకోణంపై మళ్లీ దర్యాప్తు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గడిచిన 48 గంటల్లో 100 మందికి పైగా వ్యక్తులను అరెస్టు చేసినట్లు మోదీ తెలిపారు. ఆర్జేడీ ఎమ్మెల్యే భాయ్ వీరేంద్రపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా.. ఇసుక కుంభకోణంపై దర్యాప్తుకు అటు సీఎం కూడా మద్దతిచ్చారు. ఇందుకోసం కేకే పథక్ అనే సీనియర్ అధికారిని రాష్ట్ర గనులశాఖకు ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

గత మూడు నెలలుగా సుశీల్ మోదీ.. లాలూ, ఆయన కుమారులపై అవినీతి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య జరిగిన ఓ మీడియా సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించిన ఆయన .. లాలూకు వ్యతిరేకంగా తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కర్ణాటకలో ఐటీ సోదాలు

దిల్లీలో శివకుమార్‌కు చెందిన ఇంట్లో నుంచి రూ. 5 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని మరో భవనంలో రూ. 2.5కోట్లు గుర్తించి సీజ్ చేశారు. పన్ను ఎగవేత కేసులో ఈ దాడులు చేసినట్లు ఐటీ అధికారులు వెల్లడించారు.

గుజరాత్ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల తమ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించిన విషయం తెలిసిందే. వీరికి మంత్రి శివకుమార్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలతో కలిసి ఈగల్‌టన్ రిసార్ట్‌లో ఉండగా.. ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. అనంతరం ఆయనను రిసార్ట్ నుంచి తన నివాసానికి తీసుకొచ్చి.. అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇదే సమయంలో కర్ణాటక, దిల్లీల్లో శివకుమార్‌కు చెందిన ఆస్తులు, భవనాల్లో సోదాలు నిర్వహించారు.

కాగా.. మంత్రి సహా గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల గదులను కూడా సోదా చేసినట్లు వార్తలు వస్తుండగా ఐటీ అధికారులు వాటిని తోసిపుచ్చారు. రిసార్ట్‌లోని ఒక్క మంత్రి గదిని మాత్రమే తనిఖీ చేశామని.. ఎమ్మెల్యేల గదుల్లో సోదాలు చేపట్టలేదని పేర్కొన్నారు.

## రెపో రేటు తగ్గుదల

(రెపో)రేట్లపై నిర్ణయం తీసుకునేందుకు ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మంగళవారం కూడా భేటీ అయింది. వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో తగ్గిన నేపథ్యంలో కుంటుపడ్డ పారిశ్రామికోత్పత్తికి ఊతమిచ్చేలా ఈసారి సమీక్షలో ఆర్బీఐ రెపోరేటును పావు (0.25) శాతం తగ్గించవచ్చని బ్యాంకర్లు, విశ్లేషకులు ముందుగా అంచనా వేశారు. అంతకంటే ఎక్కువ తగ్గించేందుకూ అవకాశాల్లేకపోలేవని కొందరు నిపుణులు భావించారు.

జూన్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం చారిత్రాత్మక కనిష్ఠ స్థాయి 1.54 శాతానికి తగ్గింది. మరోవైపేమో పారిశ్రామికోత్పత్తి, వస్తు తయారీ రంగాలు నిస్తేజంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగ పెట్టుబడులను పునరుద్ధరించేందుకు వడ్డీరేట్లను అరశాతం తగ్గించాలని ఇండస్ట్రీ వర్గాలు కోరుకున్నాయి. గత నాలుగు సమీక్షల్లో ఆర్బీఐ రెపోరేటును యథాతథంగానే కొనసాగించింది.

## నిస్వార్థ సేవలతో గుర్తింపు

గుర్తు చేశారు. నాగేశ్వరరావు దంపతులను అశోక్‌బాబు, పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్ ఎన్జీవో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు, ఎన్జీవో నాయకులు ఎం.డి.ఇక్బాల్, బి.ఆనంద్, డి.సత్యనారాయణరెడ్డి, కోనేరు రవి, పింఛనర్ల సంఘం నాయకులు సోమేశ్వరరావు, దాలినాయుడు, వెంకటేశ్వరరావు, ట్రజరీ అండ్ అకౌంట్స్ శాఖ జాయింట్ డె%రెక్టర్ ఎ.శివప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ జి.లలిత, వి.నాగమహేష్, ట్రజరీ అసోసియేషన్ నాయకులు ఎస్.శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు

## బ్యాంకు సబ్సిడీ వినియోగించుకోవాలి

భూమిపూజ చేసి, లబ్దిదారులకు అనుమతి పత్రాలను అందజేశారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలసి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు మొక్కలను నాటారు. మండలంలో ఉన్న తండాల్లో సమస్యాత్మకంగా ఉన్న స్వర్గపురుల నిర్మాణాలకు అటవీ శాఖ నుండి అనుమతులు మంజూరు చేసేందుకు ఉన్నతాధికారులతో తాను మాట్లాడినట్లు సభాపతి వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చిన్నారులకు సభాపతి ఎంఆర్ టీకాలను వేశారు. అంగన్ వాడీ కార్యకర్తలకు వంటపాత్రలను సభాపతి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పిఆర్ డీఈ మల్లిఖార్జునరావు, మండల అధికారులు కటకం నగేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ విశాఖ లక్ష్యం కావాలి

స్వచ్ఛ భారత్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి జివియంసిలో చేపడుతున్న ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. పర్యటనలో అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి, సి.యం.ఓ.హెచ్ డా. హేమంత్ కుమార్, ఏ.యం.ఓ.హెచ్‌లు, ప్రజారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ వారి 'సంపూర్ణ కేన్సర్ సురక్ష'

## కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ

విశాఖపట్నం : ద్వారకానగర్ రెండో లైన్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ (ఎస్‌బిఐ) కార్యాలయంలోని కేన్సర్ బీమా సౌకర్యం కోసం 6 సం. నుంచి 65 సం. వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు విశాఖ ఎస్‌బిఐ లైఫ్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యమూర్తి విలేఖరులకు ఈ తెలిపారు. ఈ పాలసీకింద రూ. 10 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు ఉంటుందని అన్నారు. దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న కేన్సర్ రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని వారికి ఆర్థిక స్థితి నుండి వెసులుబాటు కల్పించేందుకు ఈ నూతన పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ ఎన్. రఘువర్మ, విశాఖ ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛత పక్వాడా సదస్సు

విశాఖపట్నం : భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారత ప్రభుత్వం ప్రజలను ఉద్దేంచి స్వచ్ఛత పక్వాడా అనే కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం ద్వారా ఆగస్టు 1 నుండి 15వ తేదీ వరకు ప్రతీ రోజూ కొన్ని కార్యక్రమాలను చేయాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. అన్నపూర్ణ మాట్లాడుతూ మానవ జీవితం ఎంతో విలువైనదని, ఆ జీవితంలో స్వచ్ఛత మరీ విలువైనదని పేర్కొన్నారు. బాహ్య స్వచ్ఛత ఎంత ముఖ్యమైనదో మానసిక స్వచ్ఛత కూడా అంతే ముఖ్యమైనదని యువతకు సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. ప్రకాష్ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాన్ని దేశంకోసం కాకుండా అది ముందుగా మీ ఇంటినుంచే ప్రారంభం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓలు సిహెచ్ శ్రీనివాస రావు, సిహెచ్. మల్లిక, ఎంఎస్ నాయుడు, ఇందిర దగ్గరుండి జయప్రదం చేయించారు. 2 నుండి 5వ తేదీ వరకు ఎన్ఎస్-ఎస్ వాలంటీర్ల చేత తాము చదువుతున్న కాలేజీ క్యాంపస్‌లో ఉన్న లేబొరేటరీ,లైబ్రరీ, టాయిలెట్స్, ఆడిటోరియం మొదలగునవి పరిశుభ్రం చేయవలసిందిగా షెడ్యూలు ఉన్నందున స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఎవిఎన్ కళాశాల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో వాలంటీర్ల చేత పరిశుభ్రం చేయించారు.

# తూ.గో జిల్లాలో విస్తారంగా వర్షాలు

రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం రాజానగరం, అనపర్తి, పెద్దాపురం, మండపేట, రామచంద్రాపురం, కాకినాడ, పెద్దాపురం నియోజకవర్గాల్లో భారీవర్ష కురిసింది. రాజమహేంద్రవరంతో పాటు జగ్గంపేటచ ప్రత్తిపాడు, పిఠాపురం, కోనసీమ ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

వారం రోజులుగా వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. ఈ వర్షాల వల్ల మెట్ట ప్రాంతాల్లో పంటల సాగు పనులు జోరందుకుంటున్నాయి.

# ఘనంగా పింగళి వెంకయ్య 141 జయంతి వేడుకలు

విశాఖపట్నం : దేశభక్తికి నిర్వచనం పింగళి వెంకయ్య అని ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యులు పివిఎన్ మాధవ్ చెప్పారు. ద్వారాకానగర్‌లోగల శ్రీ కృష్ణ విద్యామందిర్‌లో శ్రీ శారదా కళానికేతన్ ఆద్వర్యంలో బారతజాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్యగారి 141వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశం కోసం సర్వసం దారపోసిన మహానీయుడు పింగళి వెంకయ్య అని కొనియాడారు.నిరాడంబరమైన , నిస్వార్థమైన జీవితాన్ని గడిపిన మహా మనిషిగా పేర్కోన్నారు. జీవితాంతం దేశం కోసం స్వాతంత్ర్యం కోసం పోరాడిన వెంకయ్య ఎందరికో స్ఫూర్తిగా నిల్చారన్నారు. అటువంటి వ్యక్తి చివరి రోజుల్లో చాల ఇబ్బందులను ఎదుర్కోన్నప్పటికి ప్రభుత్వం సాయం మాత్రం ఆశించని గొప్ప వ్యక్తి అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీజీ ప్రొద్బలంతో పింగళి వెంకయ్య జాతీయ జెండాకు రూపకల్పన చేశారన్నారు. ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చేరుకున్న ఎవరిని చూసినా దానికి ప్రధాన కారణం వారిలో దేశభక్తి కలిగి వుండడమేనని పేర్కోన్నారు. అనంతరం వ్యాసరచన, వ్యక్తితృత్వం పోటీలలో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అతిధుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో




శ్రీశారదాకళానికేతన్ ఎ శ్రీనివాస్‌రావు,శంకర్ నీలు, రమేష్‌బొప్పున, ప్రముఖ రచయిత డివి సూర్యారావు , శ్రీ కృష్ణవిద్యామందిర్ ప్రధానచార్యులు శ్రీమతి టి నాగేశ్వరి దేవి , విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు. అంతకు ముందు విద్యార్థినులు దేశభక్తి గీతాలను అలపించారు.



విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారు ఋషికేశ్ శాఖాభవనంలో చాతుర్మాస్య దీక్షలో శ్రీచరణుల ఆశీర్వచనాలు తీసుకోడానికి అనకాపల్లి నియోజకవర్గం, ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి(అవంతి)శ్రీనివాస్, స్వామివారు నిత్యం చేసే అర్చనాది కార్యక్రమాల్లో పాల్గొని తీర్ధ ప్రసాదాలను తీసుకున్నారు.

## జోనల్ కమిషనర్ కంపోస్టు యార్డు పరిశీలన



భీమునిపట్నం: జోనల్ ఏరియాలలో జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు కంపోస్టు యార్డును పర్యవేక్షించారు. అనంతరం వార్డులలో వున్న కాలువలు పరిశుభ్రంగా వుంచాలని సిబ్బందికి తెలిపారు. వార్డులలో పర్యటించి ఇంటి పరిసరాలలో నీటిని నిల్వ వుంచకుండా చూసుకోవాలని వాటివల్ల నిల్వ వుంచడం వల్ల దోమలు వస్తాయని, వాటివలన మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని, ఇంట్లో వుండే వాటర్ ట్యాంక్‌లలో బ్లీచింగ్ వేసుకోవాలని సూచించారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆర్‌డివో కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము




అచ్యుతాపురం: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 3న అనకాపల్లి ఆర్‌డివో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము అన్నారు. శనివారం స్థానిక సెజ్ పరిశ్రమల వద్ద, ముఠా సంఘాల ఆటో, విఆర్‌ఏ తదితర ప్రాంతాలలో కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 3 సంవత్సరాల పాలనలో కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇప్పుడున్న ధరలకు కార్మికులకు కనీస వేతనాలు పెంచాలన్నారు. మండలంలో ఉన్న సెజ్ కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం విఆర్‌ఏ, ఆటో, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.సోమునాయుడు, విఆర్‌ఏ సంఘాల నాయకులు, ముఠా నాయకులు, సెజ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలు రద్దు చేయాలి

### గ్యాస్‌పై సబ్సిడీని కొనసాగించాలి

విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై ప్రతీనెల 4/-రూ॥లు పెంచాలని చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం ఆరిలోవలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తూ సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో రాస్తారాకో జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతుందన్నారు. గతంలో ఒక్కసారిగా 40/-రూ॥లు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు ప్రతీనెల గ్యాస్ ధరలు పెరుగుతాయని క్రమంగా 2018 మార్చి నాటికి గ్యాస్‌పై ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా రద్దు చేయాలని కుట్ర పన్నుతుందన్నారు. పేదలందరికీ ఉచితంగా గ్యాస్ కనెక్షలు దీపం పథకం ద్వారా ఇచ్చి ఇప్పుడు సిలిండర్ ధరలను పెంచడం వలన పేదలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతూ వుంటే ఇక్కడ మన దేశంలో గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమన్నారు. జి.ఎస్.టి పేరుతో అన్ని వస్తువులపై పన్నులు వేస్తున్న ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులుపై మాత్రం జి.ఎస్.టి విధించకపోవడం దుర్మార్గమన్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై జి.ఎస్.టి విధించినట్లయితే ఇప్పుడున్న ధరల కంటే తక్కువ ధరలకు సరఫరా చేయవచ్చు అన్నారు. తక్షణమే గ్యాస్ సిలిండర్‌లపై పెంచిన ధరలను రద్దు చేయాలని గ్యాస్ మీద సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

సిపిఐ(ఎం) జోన్ కమిటీ సభ్యురాలు బి. సూర్యమణి మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రతీపక్షాలన్నీ గ్యాస్ ధరలపై నిరసన వ్యక్తం చేస్తే మన తెలుగు రాష్ట్ర ఎం.పిలు మాత్రం నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజల ఓట్లు మీద వున్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేకపోవడం దారుణమన్నారు. ప్రజలందరిపైన భారాలు పడే గ్యాస్ ధరలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జోన్ కమిటీ నాయకులు పి. శంకరరావు, వి. నరేంద్రకుమార్, ఎస్. రంగమ్మ, ఐ.సి నాయుడు, గణపతి, రత్నం, ముంతాజ్ బేగం, గోపి, సన్యానప్పడు, నాగరాజు, రాధాబాయ్ తదితరలు పాల్గొన్నారు.

# సింహాద్రినాధా! స్వామీ! వెళ్లొస్తాను...దాసుడు



సింహాచలం : సింహాద్రినాధుని ఒడిస్సా ఆరాధ్య భక్తుడు లక్ష్మీకాంత్ దాసో నాయక్ ( దాసుడు ) నిన్న తన స్వగ్రామమైన పట్టుపురం తిరుగు ప్రయాణం అయ్యారు. ముందుగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు . అనంతరం గత ఏడాదినుండి ఇప్పటివరకు తన హుండీలో దాచుకున్న డబ్బులను స్వామివారి హుండీలో వేశారు. ఓం నమోనారాయణనాయ అంటూ తురుగు పయనం అయ్యారు. కొండక్రింద కార్యనిర్వహణాధికారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్ ను కలసి తనకు తోచిన మర్యాదలు చేసి చిరుమందహాసంతో వెళ్ళొస్తాను అని కార్యనిర్వాహణాధికారితో చెప్పారు. దాసుడు తనబృందంతో ఈ ఏడాది జరిగిన చందన యాత్ర అనంతరం వచ్చి నేటివరకు స్వామివారి సేవలో తరించారు. ఆయన ఉన్న 4నెలలు స్వామివారికి, అమ్మవార్లకు శోభాయమానంగా వివిధ సువాసన కలిగిన పుష్పాలతో అలంకరణ చేయించి , పాయసం , పంచామృతం , పలుజాతుల ఫలాలు నైవేద్యాలు చేయించేవారు . ఆయన దర్శన అనంతరం స్వామివారి తులసిని భక్తులకు ప్రసాదంగా వితరణ చేసేవారు.దాసుడు తన ప్రదేశానికి తిరిగి వెళ్ళేటపుడుఎప్పటివలే ఆలయంలో విధులు నిర్వహిస్తున్నవారందరికీ కొత్త దుస్తులు, కానుకలు ఇచ్చి వెళ్తారు . అయితే దాసుడు ఉన్నంతకాలం వివిధ జాతుల పుష్పాలతో అలంకరణలో స్వామివారు, గోదాదేవి భక్తులకు వీనుల విందుగా దర్శనం కలిగేది ఆయన వెళ్ళిన తరువాత అంత అలంకరణ కనిపించదేమో అని భక్తులు, ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. కొండక్రింద స్వామివారి ఉద్యానవనం(పూలతోట) ఒకనాడుమల్లె, గులాబి, విరజాజి, లిల్లి, తదితర జాతుల పుష్పాలు పూసేవి అని ఆలయ వైదిక వర్గాలు తెలిపాయి. రోజుకు సుమారుగా రెండు నుండి మూడు వేల రూపాయిలు ఖర్చు చేస్తున్నాసింహాద్రినాదునికి అలంకరణ అంతంత మాత్రంగా నే జరుగుతోంది అనటంలో వాస్తవం లేకపోలేదు. కోట్ల రూపాయిలు ఆదాయం కలిగిన స్వామివారికి తక్కువ పుష్పాలు కలిగిన దండలతో , గజమాలతో అలంకరించి తుతూ మంత్రంగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు అని భక్తులతో పాటు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

అయితే స్వామివారి పుష్పాలంకారం విషయం లో పలుమార్లు ఆలయ అధికారులకు కార్యనిర్వాహణాధికారి ఎన్నోసార్లు నిత్యం స్వామివారికి పుష్పాలంకారం , దండాలు వేయాలని అక్షింతలు వేయటం జరుగుతోంది . అయినా అధికారుల తిరుమారదాయే అని కొంతమంది ఉద్యోగులు అంటున్నారు.

# సింహాచలం దేవస్థానముకు కొత్త ఎస్డీసీ

సింహాచలం : సింహాచలం దేవస్థానము భూపరిరక్షణ విభాగానికి కొత్త ఎస్డీసీ బుధవారం విధుల్లో చేరారు. ఎస్డీసీ (స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్) హెచ్ విజయరాం తొలుత సింహాద్రినాధుని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం సహాయ కార్య నిర్వాహణాధికారి ప్రసాద్ ఘనస్వాతం పలికారు. అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ముందుగా ఆయన కప్పస్థంభం ఆలింగనం చేసుకున్నారు. వేదనాదాల నాధుమ బేడా ప్రదక్షణ చేసారు. స్వామివారికి తమగోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం పలికారు.

ఆలయ అధికారులు ఆయనకు తీర్ధ ప్రసాదాలు అంజేశారు.

## చోడవరం, కె.కోటపాడు, చీడికాడ మండలాలలో

# కలెక్టర్ సుడిగాలి పర్యటన






చీడికాడ : బుధవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ చోడవరం, కె.కోటపాడు, చీడికాడ మండలాలలో విస్తృత పర్యటన చేశారు. ఆయా మండలాలలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులను తనిఖీ చేశారు. కె. కోటపాడు మండలం కె. సంతపాలెం గ్రామం నుండి తన పర్యటన ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రిప్ ఇరిగేషన్ పనులను పరిశీలించారు. అదే గ్రామంలో బొప్పాయి పంటను, సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా ప్రయోగాత్మకంగా పెంచుతున్న తైవాన్ జామ తోటను పరిశీలించి రైతులను ప్రశంసించారు. కింతాడ గ్రామంలో ఎన్ఆర్‌జిఎస్ కన్వర్జన్స్ నిధులతో చేపట్టిన 3 సంవత్సరాలుగా వేసిన మామిడి తోటను, అక్కడే ఉన్న ఫామ్‌పాండ్ ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. కస్తూరిబా బాలికల వసతి గృహంలో ఇన్స్‌ట్యూషన్ కింద కొబ్బరి మొక్కలను కలెక్టర్ నాటారు. ఆర్లి గ్రామంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వం గతంలో 700 ఎకరాలను ఇవ్వగా ఆ భూమిలో పచ్చదనం నెలకొల్పడంలో భాగంగా 11 వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని కలెక్టర్



ప్రారంభించారు. ఆ గ్రామంలో ఉన్న ఉపాధి కూలీలతో సమావేశమై ముఖాముఖి మాట్లాడారు. గుల్లేపల్లి గ్రామంలో ఎన్ఆర్‌ఇజిఎస్, డిఆర్‌డిఎ ద్వారా చేపట్టిన రోడ్డు కిరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం చౌడువాడ పిహెచ్‌సిని సందర్శించారు. చోడవరం మండలంలో చీమనాపల్లిలో ఎన్ఆర్‌ఇజిఎస్ నిధులతో చేపట్టిన ఫాంపౌండ్‌లను పరిశీలించి అక్కడ ఉపాధి హామీ కూలీలతో కలెక్టర్ సమావేశమైనారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్ఆర్ పేటలో రోడ్ల కిరువైపులా మొక్కలను నాటి, అంబేరుపురం గ్రామంలో నిర్మాణంలో వున్న గ్రామ పంచాయితీ భవనాన్ని తనిఖీ చేశారు. చీడికాడ మండలం మంచాల గ్రామంలో 70 ఎకరాలలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నిర్వహిస్తున్న కూరగాయల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులతో సమావేశమైనారు. ఇక్కడ బోర్ల నిర్వహణకు సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడం పరిశీలించారు. అనంతరం గట్టు వెంబడి వేసిన కొబ్బరి మొక్కలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్, గ్రామస్తులతో సమావేశమైనారు. ఈ పర్యటనలో డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, డిఆర్‌డిఎ ఎపిడి, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## వరద బీభత్సం

ఈశాన్యంలోని అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరంతోపాటు, పశ్చిమాన గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో వరదలు ముంచెత్తి బీభత్సం సృష్టిస్తున్నాయి. తూర్పున బీహార్, ఒడిషా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా వరదలు వచ్చినయి. ఝార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలను కూడా వరదలు ముంచెత్తాయి. ప్రధాని అసోం రాజధాని గువాహటి చేరుకొని వరద పరిస్థితి సమీక్షించారు. జూన్ మొదలుకొని జూలై రెండవ వారం వరకు అస్సాం వరద తాకిడికి గురై అల్లల్లాడింది. వేల ఎకరాల పంట నష్టంతో పాటు కజిరంగా జాతీయ పార్కు తొంభై శాతం జలమయమైంది. ఈశాన్యంలో వరదలు రావడం ఈ ఏడాది మొదటిసారి కాదు. తరచుగా అసోం అనుభవిస్తున్న దుఃఖం ఇది. ఒక్క అసోంలో నే కాదు, దేశంలోని అన్ని వరద బాధిత ప్రాంతాల ప్రజల దైన్యమిది. గత కొన్ని వారాలలో దేశవ్యాప్తంగా రుతుపవన వానల వల్ల కనీసం ఏడువందల మంది మరణించారు. అయితే అసోంలో వరద బీభత్సం ఉధృతంగా ఉన్నప్పుడు కాకుండా, తగ్గుముఖం పట్టిన దశలో ప్రధాని మోదీ సందర్శించడం, గుజరాత్ వరద ప్రాంతాలను మాత్రం ముందే పర్యటించడం పట్ల విమర్శలు వచ్చాయి. గుజరాత్ ప్రధాని సొంత రాష్ట్రం కావడం, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉండటం వల్ల సహాయ చర్యలు పకడ్బందీగా సాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కానీ గుజరాత్ అనుభవిస్తున్న విషాదం నేపథ్యంలో ఇటువంటి విమర్శలను పట్టించుకోవలసిన అవసరం లేదు. గుజరాత్‌లో గత నూటా పన్నెండేండ్ల చరిత్రలో ఇంత భారీ వానలు పడలేదని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నా రు. వరదల వల్ల రెండువందల మందికి పైగా మరణించారు. గుజరాత్ పరిస్థితి దృష్ట్యా కొంత ఎక్కువ దృష్టి పెట్టినప్పటికీ, మిగతా రాష్ట్రాల్లోని వరదబాధితులను విస్మరించారనే విమర్శలకు తావు ఇవ్వకూడదు. వరదల మూలంగా దేశవ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారు. గత ఏడాది సాగిన ఒక అధ్యయనం ప్రకారం- కనీసం పదిశాతం జనాభా సామాజిక విధ్వంసానికి గురవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు సంభవించడం వల్ల, రుతుచక్రం మారిపోయి ప్రకృతి బీభత్సాలు సంభవిస్తున్నయి. వరదలు ఎప్పుడో ఒకసారి రావ డం కాదు, ఇక ముందు తరచుగా సంభవించే అవకాశాలు ఉన్నాయి. గుజరాత్‌లో ఇప్పటివరకు కరువుతో అల్లాడిన ప్రాంతాల్లోనే ఈసారి భారీ వానలు పడటం విశేషం. ఏడాది మొత్తం కురిసే వానలో మూడువంతులు ఒకేసారి కుంభవృష్టి కురిసింది. భవిష్యత్తులో ఓ ఏడాది కరువు పీడించవచ్చు, ఆ తరువాత వానలు పడితే భారీగా కురిసి, అదొక ప్రకృతి విపత్తుగా మారవచ్చు. అందువల్ల ప్రభుత్వాలు కూడా ఈ భారీ వానలకు, వరదలకు శాశ్వత ప్రాతిపదికన సిద్ధపడటం అవసరం. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చెప్పుకోదగిన ముందడుగు పడలేదు. అస్సాం పర్యటన సందర్భంగా ప్రధాని తక్షణ సహాయం కొంత ప్రకటించ డంతోపాటు మరో వంద కోట్లు శాశ్వత పరిష్కారం కోసం అధ్యయనం చేయడానికి కేటాయించినట్టు వెల్లడించారు. శాశ్వత పరిష్కారం అనే మాట ప్రధాని నోట రావడం హర్షించదగినదే అయినప్పటికీ, ఈ హామీ ఈశాన్య ప్రాంతానికి మాత్రమే పరిమితమైంది. ఆ బృహత్కార్యం ఇంకా అధ్యయనం సాగి ఆచరణ రూపం దాల్చవలసి ఉన్న ది. ఇప్పటి వరకు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆహార పొట్లాలు ఇవ్వడం వరద ఉధృతి తగ్గిన తరువాత ఇతర్రతా సహాయాలు చేయడం వరకే ప్రభుత్వాలు పరిమితం అయి ఉన్నాయి. ఇప్పుడు గుజరాత్, ఈశాన్య ప్రాంతాలలో కూడా ఇదే తరహా సహాయ చర్యలు సాగుతున్నయి. వాతావరణ పరిస్థితులు భారీ మార్పులకు లోనయిన నేపథ్యంలో భారీ వానలు, వరదల వంటి ప్రకృతి బీభత్సాలను ఎదుర్కొనే విధానం కూడా మారాలె. ప్రతి రెండు లేదా మూడేండ్లకు ఒకసారి ఈ జల ప్రళయాలు వస్తాయనే అంచనాతో వ్యూహాలను రూపొందించుకోవాలె. ఒకప్పుడు వరద నష్టం అంటే ప్రాణ నష్టం లెక్కవేసేవారు. పంట నష్టం, ఇతర ఆస్తి నష్టం కూడా పరిగణనలోకి తీసుకునే వారు. కానీ 1980 దశకం నుంచి ఈ అంచనా తీరు మారిపోయింది. పారిశ్రామిక, వ్యవసాయ, సామాజిక మౌలిక వసతులకు కలిగే నష్టాన్ని, జీడీపీ ఎంత శాతం దెబ్బతింటున్నదనే ప్రాతిపదికన అంచనా వేసుకోవాలె. ఉదాహరణకు ఇటీవలి వరదల వల్ల అహ్మదాబాద్‌లోనే 150 కర్మాగారాలు మూతపడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా మూడేండ్లకు ఒకసారి వచ్చే వాన నీటిని కాపాడుకుని కరువు కాలంలో వాడుకోవడానికి జలాశయాలు నిర్మించుకోవాలె. ప్రతి గ్రామాన్ని, ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి.

## దక్షిణ అభివృద్ధికి.. అహర్నిశలు శ్రమిస్తున్నాం

### ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్





విశాఖపట్నం: దక్షిణ అభివృద్ధికి.. అహర్నిశలు శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 15వవార్డు, అశోక్‌నగర్‌లో రూ.30 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దొండపర్తి జంక్షన్ నుంచి డీఆర్‌ఎం ఆఫీసు వెళ్ళే రోడ్డులో రూ.19.80లక్షలతో చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యేకు వచ్చిన వినతుల్లో రోడ్ల సమస్యలు కూడా వున్నాయని, ప్రజలు కోరిన పనిని వెంటనే చేస్తున్నామని తెలిపారు.

అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, వీర రావుబుజ్జి, వెంకటేశ్వరరావు, గంట్యాడ శంకర్రావు, జివియంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

- 61సార్లు రక్తదానం చేసిన ఎ.యు. వీసీ నాగేశ్వరరావు
- నిరంతరం రక్తదానం చేయడమే లక్ష్యం - ఎమ్మెల్యే వాసుపల్లి
- వి.జె.ఎఫ్.లో విజయవంతంగా రక్తదాన శిబిరం




విశాఖపట్నం : రక్తదానం ప్రాణదానంతో సమానమని టీడీపీ అర్బన్ అధ్యక్షులు, విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్‌లో వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్, వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఆంధ్రాయూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గొల్లపూడి నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ నిరంతరం రక్తదానం చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. ప్రతిఏటా తమ సంస్థల నుంచి సుమారు 400 లీటర్ల రక్తాన్ని సేకరించి, వివిధ అవసరాల్లో ఉన్నవారికి అందజేస్తామన్నారు. తాను ఇప్పటివరకు 6 సార్లు రక్తదానం చేసానన్నారు. భవిష్యత్‌లో రక్తదానాన్ని ప్రోత్సహించే విధంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా పలువురికి రక్తం అందజేస్తున్నామన్నారు. ఏ.యూ. వీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 61 సార్లు రక్తదానం చేశానన్నారు. తాజాగా జర్నలిస్టుల శిబిరంలో కూడా రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. మనిషి శరీరంగా 5 నుంచి 6 లీటర్ల వరకు రక్తం ఉంటుందని, ఒకసారి రక్తదానం చేస్తే కేవలం 350 మిల్లీ లీటర్లు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. రక్తదానంపై ఎటువంటి అపోహలు చెందవల్సిన అవసరం లేదని, రక్తదానం చేసిన వారికి నూతన ఉత్తేజం, ఉత్సా హం కూడా వెల్లివిరుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వీసీలు రక్తదానాలు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలోనూ వి.జె.ఎఫ్. ముందు వరుసలో వుంటుందన్నారు. భవిష్యత్‌లో సభ్యుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు మాట్లాడుతూ సభ్యుల కోసం తరచూ వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడంతో పాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీ వీడియో జర్నలిస్ట్‌ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అమిత్, పి.ఎన్. మూర్తితోపాటు పెద్దఎత్తున జర్నలిస్టులు,దివాకర్, ఇరోతి ఈశ్వరరావు, డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నోటా'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్

గుజరాత్: రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబవ్) ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ బుధవారంనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గురువారంనాడు ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టే అవకాశం ఉంది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' ప్రవేశపెట్టడంపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులోనూ అభ్యంతరాలు లేవనెత్తింది. రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' ఆప్షన్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. ఈనెల 8న గుజరాత్‌లో మూడు రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోనున్నారు.

అయితే నోటా ఆప్షన్‌ను ఎన్నికల కమిషన్ నోటిపై చేయడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగ సవరణ జరక్కుండా ఎలా రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' ప్రవేశపెడతారని ప్రశ్నిస్తోంది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికలకుముందే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో తమ పార్టీ రాజ్యసభ అభ్యర్థి అహ్మద్ పటేల్‌ను ఏవిధంగానైనా గెలిపించుకోవాలని పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. తక్కిన ఎమ్మెల్యేలకు బీజేపీ గాలం వేయకుండా అడ్డుకునేందుకు వారిని బెంగళూరు రిసార్ట్‌కు సైతం తరలించింది. అంతేకాకుండా తమ పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేయాలని కూడా కాంగ్రెస్ నిర్ణయించింది. గుజరాత్ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా బీజేపీ ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఇటీవల గుజరాత్ కాంగ్రెస్ నుంచి రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్న బల్వంత్ సింగ్ రాజ్‌పుత్‌లను పోటీలోకి దింపింది.

## కవి సమయం

### 'సెల్లు గోల'

అదే పనిగా వాగుతుంది నా సెల్లు
మాట్లాడేది మాత్రం సొల్లు
వాడతాను టాక్ టైము ఫుల్లు
భారీగా వస్తుంది నెలసరి బిల్లు
దానిని చూస్తే తూలుతుంది ఒళ్ళు
దానిని చూసి ఫ్రెండ్స్ పడతారు కుళ్ళు
పడుతుంది జేబుకు చిల్లు
వదిలేసాను ఉద్యోగం మిల్లు
అందుకే రాబడి మాత్రం నిల్లు
రోజూ నాన్న తీసుకుంటాడు క్లాసు
తిట్లన్నీ ఊర మాసు
ఇవేమి బాధలు దాసూ

... రచయిత
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : ఏకాదశి సా. 4.25
మూల రా. 9.33 వ.రా. 7.47ల 9.33

గురువారం 03-08-2017

**మేషం** : నిరుద్యోగులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. వ్యాపారాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. సాంఘిక, సేవా కార్యాక్రమాలలో చురుకుగా వ్యవహరిస్తారు. ఉద్యోగుల శ్రమకు, నైపుణ్యతకు అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి.

**వృషభం** : ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్, మెకానికల్ రంగాల వారికి మిశ్రమ ఫలితం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలచోన అవసరం. ప్రయాణాలలో మెళకువ అవసరం. ఫైనాన్సు రంగమందు ఉన్నవారికి చాలా యోగం. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. మొండి బాకీలు కూడా వసూలు అగును. ప్రేమ వ్యవహారములు పరిష్కారమగును. నిరుద్యోగులకు మంచి జరుగును.

**మిథునం** : ఇతరుల కారణంగా మీ కార్యక్రమాలు వాయిదా పడటంతో కొంత నిరుత్సాహానికి గురవుతారు. విద్యార్థు లకు ఏకాగ్రత చాలా అవసరమని గమనించండి. నూతన పరిచయాలు ఏర్పడు తాయి. మొండి బాకాయిలి వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు.

**కర్కాటకం** : స్థిరచరాస్తుల విషయంలో ముఖ్యుల మధ్య విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది, మార్కెటింగ్, ప్రైవేటు సంస్థలలోని వారు అధిక శ్రమ, ఒత్తిడికి గురవుతారు. చేపట్టిన పనులలో కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తి కానరాగలదు.

**సింహం** : గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఊహించని ఖర్చులు, ఇతర్రతా చెల్లింపులు వల్ల చికాకులు తప్పవు. నిరుద్యోగులకు మధ్య వర్తుల పట్ల అప్రమత్త అవసరం. ప్రత్యర్థులు మిత్రులుగా మారి సహాయం అందిస్తారు.దీక్షా పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయసమకారం లభిస్తుంది.

**కన్య** : స్త్రీలకు చుట్టు పక్కల వారితో సంబంధ బాంధవ్యాలు నెలకొంటాయి. భాగస్వామికుల మధ్య నూతన విషయాలు చర్చకు వస్తాయి. బ్యాంకు పనులు వాయిదాపడుతాయి.ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవు తుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు.

**తుల** : విద్యార్థులకు తమ ధ్యేయం పట్ల ఆసక్తి, శ్రద్ధ పెరుగుతుంది. ప్రయోజనకరమైన విషయాలు చర్చించి సత్ఫలితాలు పొందుతారని చెప్పవచ్చు.

**వృశ్చికం** : ముఖ్యమైన వ్యవహారాలు గోప్యంగా ఉంచండి. స్త్రీలకు సన్నిహితుల నుండి అందిన ఆహ్వానాలు సంతృప్తినిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. గతంలో నిలిపి వేసిన వ్యాపారాలు, పనులు పునఃప్రారంభించటానికి చేయు యత్నాలు కలిసివస్తాయి.

**ధనుస్సు** : వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. రావలసిన ధనం అనుకోకుండా చేతికందును. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. సాంఘిక, సేవా కార్యక్రమాలలో చురుకుగా వ్యవహరిస్తారు.


**మకరం** : మాట్లాడలేని చోట మౌనం వహించటం మంచిది. ఉద్యోగస్తుల శ్రమకు, నైపుణ్య తకు అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి. సొంత వ్యాపారాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

**కుంభం** : వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదు ర్కుంటారు. స్త్రీలతో సంభాషించేటప్పుడు సంయమనం పాటించండి. విద్యార్థి నులకు ఏకాగ్రత లోపం వల్ల ఆందోళన తప్పదు.. స్థిరచరాస్తుల విషయంలో ముఖ్యుల మధ్య విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది, మార్కెటింగ్, ప్రైవేటు సంస్థలలోని వారు అధిక శ్రమ, ఒత్తిడికి గురవుతారు.

**మీనం** :ఉపాధ్యాయులకు ఒత్తిడి, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికమవుతాయి. గృహంలో మార్పులు, చేర్పులకై ప్రయత్నాలు ఫలిస్తాయి. భూ సంబంధ వ్యవహారము యందు మధ్య వర్తిత్వం జరిపి సమస్యలు పరిష్కారం చేయుదురు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు.

# బాబాను దర్శించిన యోగులు

## సంకీర్తన



కనుక ఇగోని వదిలినప్పుడే చిన్న పెద్ద తారతమ్యం లేక పసిపాపవలె హాయిగా, నిర్మలంగా, కలిసిపోయి మాట్లాడగలరు. ఆనందించగలరు.

4. నాలుగక్షరాల పదంః లవ్ (ప్రేమ) ప్రతీ వ్యక్తికీ ఉండవలసిన, పెంచుకోవలసిన సుగుణం. ప్రేమే దైవం. భగవాన్‌కు సన్నిహితులు కావాలంటే ప్రేమకు బాగా అభివృద్ధి చేసుకోవాలి. అందరికీ ఆచరించాలి. జాతి, మత, కుల, వైషమ్యాలకు పాటించని ప్రేమను పెంపొందించుకోవాలి. అయితే, స్వామి లవ్ ఆల్.. సెర్వ్ ఆల్.. అంటుంటారు. ఎన్నడూ పాజిటివ్ వైఖరితోనే చూడాలి. వ్యతిరేకార్థం తీసుకోకూడదు. ప్రేమే సర్వ మానవాళిని దగ్గరకు చేర్చేది. మనం ఎంతగా ప్రేమను పంచితే, అంతగా మనలో ప్రేమ పెరుగుతూ జీవితాన్ని ఆనందమయం గావిస్తుంది.

5. ఐదక్షరాల అందమైన మాటః స్మైల్ (చిరునవ్వు) నవ్వు మానవునికి దైవం అందించిన వరం. నవ్వలేని వారు మృగంతో సమానం. చిరునవ్వుతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ఎంతో మంది బాధల వలయంలో చిక్కుకున్నట్లు నవ్వుకు దూరమవుతున్నారు. ఆరోగ్యరత్యా కూడా చిక్కడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని అనేక మంది వైద్యులు చెబుతున్నారు. నవ్వువల్ల మనం ఆనందంగా వుంటాం. అఇతే కాక ఇతరులను కూడ ఆనందంగా ఉంచవచ్చు. తాను నవ్వుతూ అందరినీ నవ్విస్తూ సంతోషం పంచేదే సరైన జీవితం.

6. రూమర్స్ ః పుకార్లుః పుకార్లను సృష్టించడం, ప్రచారం చేయడమంటే చెత్తను ప్రోగుచేయడమే వీటిమీదే కొందరికి ఆసక్తి. ఉత్సాహం కూడా. విలువైన విషయాలపై ఆసక్తి లేని వారే ఈ పని చేస్తూ కాకమ్మ కబుర్లు చెప్తూ, వింటూ కాలం గడుపుతారు. ఒక వ్యక్తి స్వామి దగ్గర ఈ విధంగా మొరపెట్టుకున్నాడు. స్వామీ! అనేకులు అనేక విషయాలను నా చెవిన పడేస్తున్నారు. నాకేమీ తోచడం లేదు. వాటిని నమ్మాలా? వద్దా? అని ప్రశ్నించాడు. నీకు చెవులనిచ్చిన భగవంతుడే రెండు కాళ్లను కూడా ఇచ్చాడు గదా! వినడానికి ఇష్టం లేకపోతే అక్కడి నుండి వెంటనే లేచి వెళ్లిపోవచ్చు గదా! అన్నారు స్వామి. కనుక అభివృద్ధిని కుంటుపర్చే, పనికి రాని పుకార్లను నమ్మకుండా మనం సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి.

7. సక్సెస్ - విజయంః జయాపజయాలను సమ స్థితిలో స్వీకరించడంలోనే అసలు విజయ రహస్యం దాగి ఉంది. అపజయం మరో విజయానికి దారి తీస్తుంది. లాభాన్ని చేకూరుస్తుంది. నిజమైన విజయం ఆధ్యాత్మిక పరంగా ఏకాంతంలో, అపజయంలో, పేదరికంలో మనకు అనుభవమౌతుంది. అధములు సత్‌కార్యాన్ని ప్రారంభించరు. మధ్యములు కార్యాన్ని ప్రారంభిస్తారు. కానీ! ఆటంకాలకు లొంగిపోయి మధ్యలోనే వదిలిపెడతారు. ఉత్తములు మాత్రమే చేపట్టిన కార్యాన్ని కష్టనష్టాలకు వెరవకుండా కృషితో విజయాన్ని సాధిస్తారు. అటువంటి వారికే భగవదనుగ్రహం తోడై సదా కార్య సిద్ధి జరుగుతుంది.

8. జెలసీ - అసూయః అసూయ భయంకరమైనది. వ్యక్తిని సర్వ నాశనం చేస్తూ నిలువునా దహించేది. ఈ అసూయ క్యాన్సర్ మందు ఉందేమో గానీ, అసూయ నివారణకు మందు లేదు. అది జీవితాన్ని విచారగ్రస్తం చేస్తుంది. అసూయ వల్లనే యుద్ధాలు జరుగుతుంటాయి. ఒకరి అభివృద్ధిని మరొకరు చూడలేరు. తమకు ప్రాప్తం కాని విషయంలో డిప్రెషన్ ప్రారంభమై నిరాశ, నిస్పృహలు మొదలవుతాయి. -- ఇంకా ఉంది


బాబ్జి

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No:
75696 87774

## ఓటరు నమోదుపై
# నిర్దిష్ట సమాచారం లేకుంటే చర్యలు

ఆర్డీవో సూర్యారావు



బిఎల్ఒలను హెచ్చరిస్తున్న ఆర్డీవో సూర్యారావు

నర్సీపట్నం : ఓటరు నమోదు, ఓటర్ల చేర్పులు, తొలగింపులపై నిర్ధిష్టమైన సమాచారం లేకపోతే బూత్ లెవెల్ ఆఫీసర్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సూర్యారావు తెలియజేశారు. ఆర్డీవో సమావేశ మందిరంలో నాలుగు మండలాలకు సంబంధించిన బిఎల్ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కాని బిఎల్ఒలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల విషయంలో అలసత్వం వహిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం సర్వే పుస్తకంలోని అన్ని గడులను సమగ్రంగా ఖచ్చితమైన సమాచారంతో పొందుపర్చాలన్నారు. గ్రామంలో మరణించిన వారు, కొత్త ఓటర్లుగా చేరేవారు, గ్రామం విడిచిపెట్టి వెళ్లిన వారు ఖచ్చితంగా చూపించాలన్నారు. సమావేశంలో నర్సీపట్నం తహసీల్దార్ వి.వి.రమణ, మాకవరపాలెం తహసీల్దార్ రమామణి, ఎలక్షన్ డిటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీపీ



గరివిడి: అంగన్‌వాడి కేంద్రాలు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఎంపిపి పైలి. సింహాచలం అన్నారు. మండలంలో కాపు శంభం గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలు ద్వారా ప్రభుత్వం పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు నేర్పించడం పౌష్టికాహారాన్ని అందిస్తుంది అన్నారు. అలాగే గర్భిణి స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుంది అన్నారు. వీటి అన్నింటిని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పైల. బలరాం, సూపర్‌వైజర్ శారద అంగన్‌వాడి కార్యకర్తలు ఎమ్.క్రిష్టవేణి, ఆర్. అన్నపూర్ణ గ్రామ సర్పంచ్ పైడయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: స్థానిక రైల్వేస్టేషన్‌లో 3,4 ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనికి ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 8 మంది మిలీషియా సభ్యులు లొంగుబాటు



నర్సీపట్నం : నర్సీపట్నం ఏఎస్పీ వద్ద ఎనిమిది మంది మిలీషియా సభ్యులు లొంగిపోయారు. వీరి వివరాలను ఆయన వెల్లడించారు. పెద్దకొత్తలంక గ్రామానికి చెందిన నరియ సుబ్బారావు(28), వంతల సుబ్బారావు(22), కాకురి జోగిరాజు అలియాస్ జోగారావు(32), నరియా సోన్ను(35), పుట్టకోట గ్రామానికి చెందిన జర్తా తెల్లనయ్య అలియాస్ తెల్లన్న(30), పోతూరి రవితేజ(25), మట్టం దొన్ను(35), మైనకోట గ్రామానికి చెందిన మట్టం నీలకంఠం(35) లంగిపోయిన వారిలో ఉన్నారు. వీరంతా విశాఖజిల్లా కొయ్యూరు మండలం మఠంభీమవరం పంచాయతీకిచెందినవారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి మాట్లాడుతూ లంగిపోయిన మిలీషియా సభ్యులందరూ నిషేదిత మావోయిస్టులైన కుడుముల వెంకట్రావు అలియాస్ రవి, విఆర్ఎల్ గోపాల్ అలియాస్ ఆజాద్, జాంబ్రి అనే వారు మూడు సంవత్సరాల క్రితం భయపెట్టి బలవంతంగా మిలీషియా సభ్యులుగా నియమించారన్నారు. మిలీషియా సభ్యులు లంగిపోవడానికి మంప ఎస్సై డి.శ్రీనివాసరావు ఎంతో కృషిచేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అభినందించారు. ఈ సమావేశంలో కొయ్యూరు సిఐ పివిబి.ఉదయ్‌కుమార్ ఉన్నారు.

## విద్యార్థులకు
# పుస్తకాలు పంపిణీ



గరివిడి: స్థానిక పట్టణంలో రామేశ్వరకొలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం వారు విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేసారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ భలగం కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజ సేవ, విద్యా అభివృద్ధిలో ఆర్యవైశ్య సంఘం వారు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి భలగం. వెంకట్రావ్, గ్రామ సర్పంచ్ భమ్మడి క్రిష్ణమ్మ, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు జె. సత్యారావు, వై.వి.ఎస్.ఎస్.ఎస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ

లక్కవరపుకోట: సర్వశిక్ష అభియాన్ కార్యక్రమంలో ఈ మండలంలోని మండల పరిషత్ పాఠశాలలకు స్పోర్ట్సు మెటీరియల్ మండల విద్యాశాఖాధికారి సి.హెచ్. కూర్మారావు బుధవారం పంపిణీ చేశారు. వాలీబాల్, కేరంబోర్డు తదితర క్రీడా పరికరాలు పంపిణీ చేసిన వాటిలో ఉన్నాయి. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన వారిలో సృజనాత్మకశక్తి వెలుగులోకి రావడం ద్వారా విద్యార్థులు చదువుల్లో రాణిస్తారని ఎం.ఇ.ఒ. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రాథమిక, ప్రాధమికోన్నత పాఠశాలలు 45కు ఎం.ఇ.ఒ. మెటీరియల్ పంపిణీ చేయగా ప్రధానో పాధ్యాయులు వీటిని అందుకున్నారు.

## రాష్ట్ర గ్రామీణ కరాటే ఛాంపియన్‌షిప్‌లో
# శ్రీచైతన్యకు స్వర్ణ పతకం



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ఇటీవల జులై నెలలో నింజాం డ్రాగాన్ సంస్థ నిర్వహించిన 5వ రాష్ట్ర గ్రామీణ కరాటే ఛాంపియన్‌షిప్ 2017లో నర్సీపట్నం శ్రీచైతన్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పోతనపల్లి హర్షవర్ధన్ బంగారు పతకం సాధించాడని సంస్థ ప్రిన్సిపల్ మండ సూర్యనారాయణమూర్తి తెలిపారు. చదువుల్లో ముందుంటున్న హర్షవర్ధన్ ఇది వరకు మూడు పతకాలు సాధించాడని, ప్రతీ పోటీలోనూ బంగారు పతకం సాధించడం విశేషమన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రాంతీయ సంచాలకులు మాకిరెడ్డి రమణ, సంస్థ ఏజిఎం ఎంవి.సురేష్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. తల్లి దండ్రులు రేవతమ్మ, చంద్రభూషణ్, ఉపాధ్యాయులు ప్రోత్సా హంతో పాటు నింజాస్ అకాడమీ సంస్థ నేషనల్ కోచ్ అబ్బు శిక్షణ వల్ల తను ఈ పతకాలు సాధించగలిగామని హర్షవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీన్ సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి మైథిలి, సురేంద్ర, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వివాహ నమోదు ఎక్కడా...

- పంచాయతీల్లో కానరాని వివాహాల నమోదు
- అవగాహన లోపం కారణం
- పట్టించుకోని పంచాయతీల పెద్దలు

నర్సీపట్నం : మండలంలోని గ్రామ పంచాయతీల్లో వివాహాల నమోదు కావడం లేదు. ముందుగా గ్రామ పంచాయతీల్లో నమోదు చేసుకున్న మీదట వివాహం చేయాలని చట్టంలో స్పష్టమైన ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రజల్లో దీనిపై అవగాహన లేకుండా పోయింది. ప్రజలకు అవగాహన కల్పించి, వివాహాలను నమోదు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. వివాహ నమోదుపై 2002లో చట్టం వచ్చింది. జివో నెం 193 ప్రకారం ప్రతీ గ్రామ పంచాయతీలో వివాహాల నమోదును ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చేపట్టాలి. ఇప్పటి వరకు ఉన్న వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కులమతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా, 2012లో అన్ని మతాల వారికి రిజిస్ట్రేషన్ చట్టం వర్తించేలా రూపొందించారు. అయితే పంచాయతీ కార్యదర్శుల వివాహ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు అవగాహన కల్పించి వివాహ నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది.

వివాహం జరిగిన గ్రామ పంచాయతీలో సదరు పంచాయతీ కార్యదర్శికి ముందస్తుగా సమాచారం అందించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పరిశీలించి వివాహం జరిగినట్లు కార్యదర్శి రిజిస్ట్రేషన్ చేసి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. వివాహం జరిగిన నెల రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. నెల దాటితే రూ.100 చెల్లించిదరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యం




తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవతి

గొలుగొండ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గొలుగొండ సెక్టార్ గొలుగొండ మండలంలో సూపర్‌వైజర్ ఐ.సత్యవతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించడం జరిగింది. జోగుంపేట-1 కేంద్రంలోని ఆయా ప్రాంతాల సెక్టార్ నుండి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలంతా ఆరోగ్య సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం చాలా ముఖ్యమని ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవతి తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భవాని, సత్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# నరసింహరాజపురం రహదారిలో వ్యాను బోల్తా

- ఒక మహిళ మృతి - పదిమందికి గాయాలు





అనంతగిరి : మండలంలో గల కాశీపట్నం సంతనుంచి ఎన్ ఆర్‌పురం గ్రామమునకు వ్యానులో గిరిజనులు సంతలో సామానులు కొనుక్కొని వెళతారు. బస్ సౌకర్యం లేని కారణంగా గిరిజనులు ప్రైవేట్ వాహనాలులో వెళుతుంటారు. ఆ క్రమములోనే గిరిజన రైతులు వ్యానులో వస్తుండగా వ్యాను అదుపుతప్పి బోల్తా పడిన కారణంగా కోటపర్తి చొప్పమ్మ అక్కడికక్కడే చనిపోయినది.

క్షతగాత్రులను 108 వాహనంలో శృంగవరపుకోట ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి ప్రధమచికిత్స చేసి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు.

## ఈనెల 4న రైతుమిత్ర గ్రూపుల సమావేశం

కొయ్యూరు : రైతుమిత్ర గ్రూపులతో ఈ నెల 4న సమావేశం నిర్వహించనున్నట్టు వెలుగు ఏపిఎం ఈశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీడి తోటలు కలిగి ఉన్న రైతులంతా రైతు ఉత్పత్తిదారుల గ్రూపుల్లో చేరాలని, వారంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

# ఈ నెల 8 నుంచి యువజనోత్సవాలు

ఎంపిడిఒ జయప్రకాశరావు

రావికమతం : రాష్ట్ర యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయప్రకాశరావు తెలిపారు. జిల్లాలో పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖపట్నం డివిజన్ కేంద్రాల్లో యువజనోత్సవాలు జరగనున్నాయన్నారు. డివిజన్ స్థాయి పోటీల్లో ఆయా విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలను జిల్లా స్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయిలో పోటీలకు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. జానపద నృత్యాలు విభాగంలో గరిష్టంగా 20 మంది సభ్యులు ఉండాలన్నారు. జానపద గీతాలు విభాగంలో గరిష్టంగా వాయిద్యకారులతో సహ ఉండాలన్నారు. ఇవే కాకుండా వన్‌యాక్ట్ ప్లే, వృక్తత్వ పోటీలు, సంప్రదాయ నృత్యం, సంప్రదాయ వాయిద్యాలు(పిల్లన గోవి, వీణ, సితార), హార్మోనియం(లలిత సంగీతం బాణీలో ఉండాలి), గిటార్(భారతీయ లేదా వెస్టన్ సంగీతం) తదితర విభాగాల్లో డివిజన్ స్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఆయా విభాగంల్లో పాల్గనే ఆసక్తి గల అభ్యర్థులు పాడేరు డివిజన్‌లోని వారు యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో 08.08.17 తేదీన జరగనున్న ఆ డివిజన్ సంబంధించి ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అలాగే నర్సీపట్నం డివిజన్‌కు సంబంధించిన వారు ఆగస్టు 22వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని, 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనకాపల్లి డివిజన్‌కు సంబంధించి ఈ నెల 29వ తేదీన వేల్పుల వీధిలోని సీతారామ కళ్యాణ మండపంలో జరుగు తుందన్నారు. అలాగే విశాఖపట్నం డివిజన్ సంబం ధించి సెప్టెంబర్ 8వ తేదీన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగునని, దీనికి సంబంధించి వచ్చే నెల 5వ తేదీలోగా ఆయా విభాగాల్లో దరఖాస్తు చేసు కోవాలన్నారు. పోటీల్లో పాల్గనదలచిన యువ కళా కారులు వారి సొంత ఖర్చులతో పోటీలకు హాజరై ముగిసే వరకు ఉండాలన్నారు. జానపద నృత్యాలకు సంబంధించి లైవ్ ఆర్కెస్ట్రా లేక పాడిన వారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మూడు సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో పాల్గన్నవారు ఈ పోటీల్లో మళ్లీ పాల్గనవసరం లేదన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ యువజనోత్సవాల్లో పాల్గనేవారు 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువతీ యువకులై ఉండాలన్నారు. డివిజన్ లేదా మున్సిపల్ కమిషనర్ వారి కార్యాలయం నుంచి దరఖాస్తులను పొంది పూర్తి చేసి ఆయా కార్యాలయాలకు సమర్పించాలన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన బదిలీ టీచర్లు

కొయ్యూరు : ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులు కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించినట్లు మండల విద్యాశాఖాధికారి బోడం నాయుడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంత మంది ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకున్నారని, మరికొంత మంది తీసుకోవాల్సి ఉందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులంతా రెండు, మూడు రోజుల్లో వారి స్థానాల్లో జాయిన్ అవుతారని ఆయన తెలిపారు.

## మందుల చీటీ మర్మమేమిటో..?

యలమంచిలి రూరల్ : ప్రభుత్వాసుపత్రిలో ప్రిస్కిప్షన్ చీటిని మందులు ఇచ్చిన తరువాత తిరిగి తీసుకోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రోగి ఆసుపత్రికి వచ్చిన తరువాత వైద్యులు ఏం మందులు రాశారో ఏం వాడారో మరుసటి రోజు తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ప్రిస్కిప్షన్ ఉండాలి. దీనికి విరుద్ధంగా రోగి వద్ద ఉన్న ప్రిస్కిప్షన్ చీటిని వైద్య సిబ్బంది వెనక్కి తీసుకుంటున్నారని వాపోతున్నారు. ఇదే విషయమై ప్రశ్నిస్తే వైద్యం చేయించుకోవాలంటే ఇక్కడ ప్రశ్నించడం కుదరదని, ఇష్టం ఉంటే వైద్యం పొందాలని లేదంటే వెళ్లిపోవచ్చని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.

## టీసీ పడిపోయింది

యానాం భీమ్‌నగర్‌కు చెందిన లంకా శ్రీకాంత్ S/o. వెంకన్నబాబుకు చెందిన ఇంటర్ టి.సి. (అడ్మిషన్ నెంబర్ 1653) పడిపోయింది. మెట్టకూరు రిజెయన్సీ జూనియర్ కళాశాల్లో ఇంటర్ మీడియట్ టిసి తీసుకొని వస్తుండగా జూలై 27వ తేదీన మెట్టకూరు రొడ్డు మార్గంలో పడిపోయింది ఇది ఎవరికైనా దొరికినయెడలా ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

లంకా శ్రీకాంత్,
S/o. వెంకన్నబాబు,
డోర్ నంబర్ 9-3-080,
భీమ్‌నగర్,
యానాం.
సెల్ నెంబర్ :
9000145199

## సిబియంలో మీజిల్స్...రుబెల్లా టీకా కార్యక్రమం



కాకినాడ : సిబియం జూబ్లి బాలికల ఉన్నత పాఠశాలలో మీజిల్స్...రుబెల్లా టీకా కార్యక్రమం బుధవారం చేపట్టారు. సిబియంజూబ్లిబాలికల ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్. ముత్తాబత్తుల రత్నకుమార్, ప్రధానోపాధ్యాయులు శాంతి గ్రేస్ సమక్షలో సుమారు 270 మంది విద్యార్థినులకు టీకీలు వేశారు.

## మోహన్స్ డయాబెటీస్ శాఖ ప్రారంభం

విశాఖపట్నం : నగరంలోని సిబిఎం కాంపౌండ్‌లో డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్ ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సనికి ముఖ్య అతిధిగా సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జి చలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటీస్ వ్యాధిపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధుమేహచికిత్సకు సంబంధించి దేశంలో అత్యున్నత కేంద్రాల్లో ఒకటిగా మోహన్ డయాబెటీస్ ఒకటిగా ఉందన్నారు. ఆనంతరం సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్ మాట్లాడుతూ దేశంలో ఈ వ్యాధి ఆందోళన స్థాయిలో ఉందన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో కనీస అవగాహన పెంచుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ముందుగా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. దేశంలో 2030 నాటికి 101 మిలియన్‌లకు చేరుకుంటుదన్నారు. దేశవ్యాప్తంగా 34 ప్రాంతాల్లో తమ క్లినిక్‌లు ఉన్నాయని రోగులకు నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన వైద్యాన్ని అందివ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలోనే అగ్రశ్రేణి మధుమేహ చికిత్సా సదుపాయాల్లో ఒకటిగా తమ ఆసుపత్రి నిలవడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇక్కడ ప్రారంభించిన అత్యాధునిక సదుపాయాలతో పరీక్షల ద్వారా వ్యాధిని నియంత్రించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సమీర్‌నందన్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## సాయిబాబాకు వినతిపత్రం అందజేసిన కాపు నాయకులు



ఆలమూరు : కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంకు మద్ధతుగా కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా బుధవారం శ్రీకృష్ణదేవరాయ కాపుసంఘం మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, గ్రామ కాపు సంఘం అధ్యక్షులు చల్లా నానాజీల ఆధ్వర్యంలో స్థానిక షిరిడిసాయి బాబాకు వినతిపత్రం అందజేసారు. కాపులను బి.సి.లలో చేరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా సి.ఎం. చంద్రబాబు నాయుడు మనస్సు మార్చాలని, ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని, ఏ కేసులలోను ఇరికించకుండా కాపులపై పెట్టిన కేసులు కొట్టివేయాలని ఈ వినతిపత్రంలో వారు కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా భూషణం, పురుషోత్తం వీర్రాజు, కోలా వెంకటేశ్వరరావు, పేరాబత్తుల భాస్కరరావు, తాకాశి దుర్గ, వెంపల సత్తిబాబు, కొమ్మిశెట్టి తాతారావు, సుందర బూరయ్య, చిన్నం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ సర్టిఫికెట్లు పంపిణి

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా పుష్పం సేవాకేంద్రం ఆధ్వర్యంలో రెండు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులకు చాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సంస్థలు సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని, వీరి బాటలోనే మిగిలిన సంస్థలు కూడా నడుచుకోవాలని, తద్వారా గ్రామంలో పేద, మధ్యతరగతి సేవ చేసినవారవుతారని కొనియాడారు. ఇటువంటి శిక్షణా తరగతులు అనేకం నిర్వహించి విద్యార్థుల భవితకు పునాదులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థల ప్రతినిధులు కొవ్వూరి వివేకానందరెడ్డి, మన్యం పర్వతవర్ధనరావు, విజయేంద్రరెడ్డి, ఇనస్ట్రక్టర్ సిహెచ్. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే పచ్చదనం

తాళ్లరేవు : మొక్కల పెంపకంతో పచ్చని వాతావరణం ఏర్పడుతుందని ప్రతీ వ్యక్తి ఒక మొక్క నాటడం ద్వారా గ్రామం పచ్చదనంతో విలసిల్లుతుందని ఎంపిటిసి సభ్యుడు దంగేటి శ్రీనివాసురావు అన్నారు. పటవల పంచాయతీ పరిధిలోని శాంతమోల ప్రాథమిక పాఠశాల అవరణలో వనం - మనం కార్యక్రమంలో భాగంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగతాని రామస్వామి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పొత్తూరి కాశీఈశ్వరుడు మొక్కలు నాటారు. ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి ధ్యేయంగా మొక్కలునాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోటిపల్లి దొరబాబు, పాఠశాల అభివృద్ధి చైర్మన్ పి. రాంబాబు, వార్డు సభ్యులు కె. సత్తిబాబు, వాస్తవాయి రాజబాబు, వి. సీతారామరాజు, పి. నాగేశ్వరరావు, కె. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 500 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

### పింగళి వెంకయ్య విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటుచేయాలి ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్



విశాఖపట్నం : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటుచేయాలని ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పింగళి జయంగి సందర్భంగా శ్రీస్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ జగదాంబ సెంటర్లో 500 అడుగుల భారీ జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించింది. పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులతో ఈ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన జహీర్ అహ్మద్ పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొణతాల శ్రీను, డిఎస్ అగర్వాల్, చింతపల్లి పోతరాజు, ఎంఎస్ హక్కు, ఎంవి. రాజశేఖర్, జానకీరావు, సూరాడ అప్పారావు, దూడ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణరెడ్డి

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బుధవారం ఎస్.వి.వి. సత్యనారాయణరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ కమీషనర్ ఉత్తర్వుల మేరకు రావులపాలెం కళాశాలకు ఎఫ్.ఎ.సి. ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యానని ఆయన తెలిపారు. వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందానని తెలిపారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ కెపి దాశరధి పదవీ విరమణ చేసిన సందర్భముగా తాను ఈ కళాశాలకు బదిలీపై వచ్చానన్నారు. ఈ సందర్భముగా కళాశాల చైర్మన్ డా॥ నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామపెద్దలు అభినందించారు.

## మండలంలో 1429 మంది కొత్త ఓటర్లుగా నమోదు

ఆలమూరు : ఎన్నికల అధికారి ఆదేశాలు మేరకు జూలై1 నుండి 31వ తేదీ వరకు తహశీల్దార్ కె.పద్మావతి పర్యవేక్షణలో మండలంలో కొత్త ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. బూత్ లెవిల్ అధికారులతో నిర్వహించబడిన ఈ నమోదులో 1429 మంది ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 18-19 సం॥లు లోపు యువకులు 458 కాగా, 20 సం॥లు పైబడిన వారు 971 మంది వున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

## ఆదిత్య కళాశాలలో ఘనంగా పింగళివెంకయ్య జయంతి



కాకినాడ : స్థానిక జగన్నాధపురంఆదిత్య ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌టి.జయ సుధాకర రెడ్డిఅధ్యక్షతన బిఇడీ, డిఎడ్, తెలుగు, హిందీ పండిట్ విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమూలలు వేసి దీపారాధన చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడు భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలలా ఇనుమడింపజేసి మన జాతీయ పతాకాన్ని ఒక తెలుగు వాడైన పింగళి వెంకయ్య రూపొందించడం ఎంతో గర్వకారణమన్నారు. జాతీయ పతాకాన్ని రూపొందించిన విధానం, విశిష్టతలను వివరిస్తూ జాతీయపతాకాన్ని గౌరవించడం ప్రతి భారతీయుని బాధ్యత అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతలకు బహుమతులు అవదజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణమూర్తి, అధ్యాపకులు జె.భానుమూర్తి, ఎమ్.భార్గవ నాయుడు, ఎమ్.సత్య నారాయణ, పివివి. సత్య నారాయణ, రాజేశ్వరి, వల్లీనిస్సాన్ అనంతలక్ష్మి మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## "నల్లబాబు"కే ఆలమూరు ఎ.ఎమ్.సి. ఛైర్మన్ పదవి

ఆలమూరు : ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఈదల సత్యనారాయణ చౌదరి (నల్లబాబు)నే తుదకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత సంవత్సరం డిసెంబర్-5న టిడిపి నేతలు నల్లబాబుని ఛైర్మన్‌గా తీర్మానం చేసి అధిష్టానానికి అందజేసారు. అయితే అప్పుడు కొంతమంది స్థానిక నేతలు పలువురు వ్యతిరేకించడం వంటివి పుకార్లు షికార్లు చేసాయి. ఆ తరువాత పలువురు ప్రజా ప్రతినిధులు ఛైర్మన్ నియామకంపై సంప్రదింపులు జరిపి, 7 మాసాలు అనంతరం ఇప్పుడు 19మంది సభ్యులతో మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ఖరారుచేస్తూ జి.ఓ. జారీ అయ్యింది. ఉపాధ్యక్షులుగా గుడిమెట్ల బాలగంగాధర్ రామ్మోహన్ డైరెక్టర్లుగా దొండపాటి సుబ్బరాజు, అల్లంరాజు రామకృష్ణమూర్తి, ముత్యాల కృష్ణమూర్తి, గోపు కృష్ణమూర్తి, సాదె రాంబాబు, మోటిపల్లి బాపిరాజు, మేడిశెట్టి నాగూర్ సాహెబ్, వారా గౌరీ, గాడా శ్రీను, షేక్ హుస్సేన్, కుడిపూడి శ్రీనివాసు, కంచర్ల పెద్ద భద్రరావు, వాసంశెట్టి గోవిందరాజు, మోదుకూరు సొసైటీ అధ్యక్షుడు రాయుడు సుధాకర్, కాకినాడ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, ఆలమూరు సర్పంచ్ గంధం బంగారుబాబు నియమితులయ్యారు.

## స్వాతంత్ర్య వేడుకలపై సమీక్ష




యానాం : స్వాతంత్ర్య దినోత్స వేడుకలపై పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా శాఖల ద్వారా చేసే ఏర్పాట్లుపై సంబంధిత అధికారులతో చర్చించారు. వేడుకల్లో అభివృద్ధి సకటాల ఏర్పాటు దీనికి సంబంధించిన అంశాలను త్వరితగతిన ఏర్పాటుచేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ డిప్యూటీ తహశీల్దారు సైజ్, ఎస్‌పి. నితిన్ గోహల్, సిఐ గూటం శివగణేష్, విద్యాశాఖ అధికారి కాలే సాయినాద్, అసుపత్రి డిడి డాక్టర్ టి. రవిశంకర్, వ్యవసాయశాఖ డిడి. శివశంకర్ మురుగన్, ప్రజాపనుల శాఖ ఇఇ శేఖరన్, ఎఇ. మేడి శెట్టి శ్రీనివాసు, మున్సిపల్ జెఇ మనోహర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ పాలనలో అచ్చాదిన్ కార్పోరేట్ సంస్థలకేనా: సిపియం

### గ్యాస్‌పై సబ్సిడీ కొనసాగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా





కాకినాడ : భారత ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అచ్చాదిన్ అంటూ పిలుపు నిచ్చారని అయితే బిజెపి ప్రభుత్వం చెప్పినట్లు కార్పోరేట్లకు మత్రమే మంచి రోజులులా. .. సామాన్యులకు గడ్డురోజులేనా అని సిపిఎం ప్రశ్నించింది. వంట గ్యాస్‌పై క్రమంగా సబ్సిడీ తగిస్తూ తదనంతరం పూర్తిగా తొలగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపద్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిపియం ధర్నా చేపట్టింది.ఈ సందర్భంగా సిపియంజిల్లా కార్యదర్శి దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇప్పటికే అనేక మార్లు పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచిందన్నారు. తాజాగా గ్యాస్‌పై స్వచ్ఛందంగా వదులుకోవాలని మోదీ ఇచ్చిన పిలుపుకు అపూర్వ స్పందన వచ్చిందన్న బిజెపి నాయకులు తాజా నిర్ణయం ఎందుకు చేశారో చెప్పాలన్నారు.

బిజెపి పాలనలో అదానీ, అంబానీలకే మంచి రోజులు తప్ప సామాన్య మద్య తరగతికి భారాల కాలమే నడుస్తుందన్నారు. ముఖేష్ అంబానీ ఆదాయం ఏడాదిలో 70వేల కోట్లు పెరిగినట్లు తెలుస్తుందన్నారు. కేవలం ఆయిల్ గ్యాస్, మొబైల్ సేవరంగాల ద్వారా పాలక పక్షం అండతో లక్ష కోట్ల లాభాలు గడిస్తున్నారని విమర్శించారు. కార్పోరేట్లకు ఇస్తున్న లక్షల కోట్ల రాయితీలు, సబ్సిడీలు, బకాయిలు ఎగ్గొడుతున్న బ్యాంకు అప్పుల వల్లనే దేశం దివాళాతీస్తుంది తప్ప కష్టజీవులవల్ల కాదన్నారు.

గ్యాస్ నిత్యావసరం కాబట్టి ధరల స్థిరీకరణ నిధితో సబ్సిడీ కొనసాగించ వచ్చన్నారు. రేషన్ షాపులను పటిష్ట పరచాలన్నారు. అంతర్జాతీయ క్రూడాయిల్‌ధరలతో పోలిస్తే పెట్రోలియం, గ్యాస్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలపై పెనుభారం ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో పలివెల వీరబాబు, ఎంవి.రమణ, వాసంశెట్టి సూర్యారావు, జిఎస్‌ఆర్ కృష్ణ, ఆర్.సతీష్, కటారి పద్మనాభం, కె.వీరబాబు, భవానీ, సుభాషిణి, వీర్రాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## పుదుచ్చేరి - హైదరాబాద్ విమాన సర్వీసులు

### మంత్రి మల్లాడి కృతజ్ఞతలు



యానాం : పుదుచ్చేరి రాష్ట్రంలో ఇటీవల ప్రారంభించిన విమానాశ్రయం నుండి విమాన సర్వీసులను ఈ నెల 16 నుంచి ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని పుదుచ్చేరి ఆరోగ్య, పౌరవిమానయాన శాఖమంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఈ నెపధ్యంలో మంత్రి మల్లాడి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్ గజపతిరాజుతో ఢిల్లీలో భేటీ అయ్యారు. కేంద్ర పౌరవిమానయానశాఖ ద్వారా పుదుచ్చేరిలో విమానయాన సర్వీసులు ప్రారంభించేందుకు సహకరించినందుకు మంత్రి మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 16వ తేదీన ఉదయం 11.30 గంటలకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు ఉదయం 10 గంటల నుండి హైదరాబాద్ చేరుకునేలా సైజెట్ విమాన సర్వీసు ప్రారంభం కానున్నదని గంటకు రూ. 2500/-లుగా టిక్కెట్ ధర నిర్ణయించగా పుదుచ్చేరి - హైదరాబాద్ మద్య సుమారు రూ. 3000/- లుగా టిక్కెట్ ధర వ్యయం కానున్నదన్నారు. తొలిత ప్రారంభించే సర్వీసు ఏధమైన ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కొంతమేర కేంద్ర సహాయం ఇవ్వనున్నట్లు తెలిపారు. టిక్కెట్ ధరలలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం భరాయించనున్నదన్నారు. ఈ మేరకు ఢిల్లీలో అశోక్ గజపతిరాజును కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఆదేవిధంగా త్వరలో పుదుచ్చేరి - బెంగుళూరు, పుదుచ్చేరి - తిరుపతి, కొయ్యంబత్తూరుల మధ్య విమాన సర్వీసులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరామన్నారు. అలాగే ఇండియన్ ఎయిర్‌లైన్ సంస్థ తమ సర్వీసులను ప్రారంభించేలా చూడాలని కోరామన్నారు. సర్వీసు ప్రారంభానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు.

### పలువురు కేంద్ర మంత్రులతో మల్లాడి భేటి

నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై కేంద్ర మంత్రులతో ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు బేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం కేంద్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి మేనకగాంధీని, మత్స్య, వ్యవసాయశాఖ మంత్రి రాధా మోహన్‌సింగ్ తో బేటీ అయ్యారు. స్త్రీ, శిశుసంక్షేమశాఖకు సంబంధించి పుదుచ్చేరిలో అదనంగా 115 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేయాలని కోరామన్నారు. వాటిలో యానాంకు సంబంధించి పలు కేంద్రాలను ప్రారంభించాలని తొలిదశలోనే యానాంకు కేటాయించాలని కోరామన్నారు. అదేవిదంగా వ్యవసాయ, మత్స్య శాఖమంత్రిని మత్స్యకారులకు సంబంధించి షేరు విడుదలచేయాలని కోరామన్నారు. సుమారు రెండు సంవత్సరాలపాటు ఒక్కొక్క మత్సకారునికి రూ. 3600/-లు చొప్పున చెల్లించవలసి ఉందని ఈ మొత్తాన్ని విడుదలచేయాలని కోరడం అయినదన్నారు. అదేవిధంగా ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న తమిళనాడు, పుదుచ్చేరి రైతులతో ముఖ్యమంత్రి వి. నారాయణసామి నేతృత్వంలో మంత్రులందరూ కలవడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, పుదచ్చేరి తదితర రాష్ట్రాలకు సంబంధించిన మత్స్యకారులను ఎస్టీలో చేర్చాలని చేస్తున్న ఆందోళన కారులతో చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నమశ్శివాయం, వి. కందసామి, షాజహాన్, కమల్‌కన్నన్‌తో పాటు జాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# చెంప చెల్లుమనిపించిన బాహుబలి బ్యూటీ

సినిమా సెట్స్‌లో ఓ నటి పట్ల మరో నటుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన బాలీవుడ్ మూవీ షూటింగులో చోటు చేసుకుంది. ఈ ఘటనతో షాకైన సదరు నటి అక్కడే అతడి చెంప చెల్లుమనిపించింది. ఆ నటి మరెవరో కాదు... 'బాహుబలి-ది బిగినింగ్'తో పాటు పలు టాలీవుడ్ చిత్రాల్లో ఐటం సాంగ్స్ చేసిన స్కార్లెట్ విల్సన్. ఈ నీచానికి పాల్పడ్డ నటుడి పేరు ఉమాకాంత్ రాయ్. 'హన్స: ఏక్ సన్యోగ్' అనే సినిమా షూటింగులో ఈ ఘటన చోటు చేసుకుంది. 'హన్స: ఏక్ సన్యోగ్' సినిమా షూటింగులో భాగంగా స్కార్లెట్ విల్సన్ మీద స్పెషల్ సాంగ్ చిత్రీకరిస్తున్నారు.

ఈ సమయంలో అదును చూసి ఉమాకాంత్ అనే నటుడు ఆమెను గోకే ప్రయత్నం చేశాడు. అతడి ప్రవర్తనతో ఇబ్బంది పడ్డ స్కార్లెట్ చెంప చెల్లుమనిపించింది. ఊహించని ఈ సంఘటనతో చిత్ర యూనిట్ మొత్తం షాకయింది. అక్కడే ఉన్న సెట్స్ మేనేజర్ అతడికి తగిన బుద్ధి చెప్పే ప్రయత్నం చేయగా, ఉమాకాంత్ ఆగ్రహంతో ఊగిపోయాడు.

దీంతో చిత్ర యూనిట్ సభ్యులు అంతా కలిసి అతడిని అక్కడి నుంచి బలవంతంగా బయటకు గెంటేశారు. ఉమాకాంత్ మీద ఫిల్మ్ చాంబర్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. అతడితో స్కార్లెట్‌కు క్షమాపణ చెప్పించడంతో పాటు ఆర్టిస్టుల అసోసియేషన్లో అతడి సభ్యత్వాన్ని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# చిత్రభాను

## 'రంగస్థలం 1985' నాటకాలు వేసే సినిమా కాదు





సుకుమార్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'రంగస్థలం 1985'. ఈ టైటిల్ ప్రకటించిన తర్వాత చాలా మందికి ఈ సినిమా నేపథ్యం ఏమిటో అర్థం కాలేదు. ఇదేమైనా రంగస్థల నాటకాల గురించి ఉంటుందా? టైటిల్‌లో 1985 అని ప్రేత్యేకంగా మెన్షన్ చేయడం వెనక కారణం ఏమిటి? ఇలా రకరకాలు సందేహాలు. చాలా మంది ఈ చిత్రం 1985 కాలంలో జరిగిన రంగస్థల నాటకాల గురించి ఉంటుందని ఊహించుకుంటున్నారు. అయితే ఈ ఊహలకు, అనుమానాలకు చిత్ర దర్శకుడు సుకుమార్ తెర దించారు. ఈ సినిమాకు, నాటకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. రంగస్థల నాటకాలకు, మా సినిమాకి ఎలాంటి సంబంధం లేదు. పల్లెటూళ్లలో ఎవరిగోల వాళ్లదే అన్నట్టుగా ఉండరు. ఏదైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా అంతా ఒక చోట గుమిగూడి ఏం జరిగిందంటూ తెలుసుకుని తమవంతు సహాయ సహకారాలను అందిస్తారు. అలా వాళ్లందరినీ ఒకేచోట చూసినప్పుడు ఆ ఊరు ఒక వేదికలా కనిపిస్తుంది. ప్రతి పల్లెటూరు ఒక రంగస్థలమే కదా అనిపిస్తుంది. అందుకే ఈ సినిమాకు ఆ టైటిల్ పెట్టామని సుకుమార్ తెలిపారు. సైన్స్ ఫిక్షన్ సినిమాలు చేయాలని ఉంది కానీ... వాటికి భారీ బడ్జెట్ అవసరం. మన మార్కెట్ సరిపోదు. హిందీలో చెయ్యాలి. అప్పుడప్పుడు అలాంటి ఆలోచనలు వస్తుంటాయి. చిన్న చిన్న లైన్స్ అనుకుంటాం. అవి వర్కవుట్ అవ్వాలంటే అన్నీ కుదరాలి. మనం ఒక మార్కెట్ చట్రంలో ఇరుక్కుపోయి వుంటాం. ఆ లిబర్టీ రావాలంటే కంటిన్యూగా సక్సెస్‌లు రావాలి అని సుకుమార్ తెలిపారు.

## స్టేట్ అసెంబ్లీలో సన్నీలియోన్ రచ్చ..




ఈ మధ్య కాలంలో బాగా పాపులర్ అయిన కండోమ్ యాడ్ ఏదైనా ఉంది అంటే... అది సన్నీ లియోన్ నటించిన మ్యాన్ ఫోర్స్ కండోమ్ యాడ్. ఈ యాడ్ ఇపుడు గోవా స్టేట్ అసెంబ్లీలో చర్చనీయాంశం అయింది. ఈ యాడ్ విషయంలో ప్రతిపక్ష నేతలు రచ్చ రచ్చ చేశారు. ఈ యాడ్ మీద ఇంత గొడవ జరుగడానికి కారణం గోవా ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కదంబ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్ప్' బస్సులో ఈ కండోమ్ యాడ్‌కు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్స్ ఉండటమే. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గోవా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎల్టీ ఆడ్రూ ఫ్రాన్స్ సిల్వెయిరా వాదించారు. ఈ బస్సులో స్టూడెంట్స్, మహిళలు ప్రయాణిస్తున్నారు, ఈ యాడ్స్ వారికి ఇబ్బంది ఉన్నాయని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. గోవాలో మహిళా సంఘాలు కూడా గతంలో ఈ యాడ్ మీద అభ్యంతరం వ్యక్తం చేశాయి. సన్నీ లియోన్ కండోమ్ యాడ్ కు సంబంధించిన స్టిక్కర్లు పబ్లిక్ ట్రాన్స్ పోర్టులో అతికించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కండోమ్ యాడ్స్ అంటే అశ్లీలత ఉట్టిపడేలా ఉంటాయనే భావన మొదటి నుండి ఉంది. గతంలో వచ్చిన కొన్ని కండోమ్ యాడ్ వీడియోలు కూడా ఇలాంటి అభిప్రాయం ఏర్పడటానికి కారణం. అయితే మ్యాన్ ఫోర్స్ కండోమ్ సంస్థ సన్నీ లియోన్ తో చిత్రీకరించి యాడ్ వీడియో ఎలాంటి అశ్లీలత లేకుండా చాలా పద్దతిగా, రొమాంటిక్ గా ఉంది. సన్నీ లియోన్ డ్రెస్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంతో అందంగా, అశ్లీలతకు చోటు లేకుండా శృంగార దేవతలా సన్నీని ప్రజెంట్ చేసారు. యూట్యూబ్ లో అప్ లోడ్ చేసిన ఈ వీడియోకు ఇపుడు మంచి స్పందన వస్తోంది. సన్నీ అభిమానులను కలలో లోకంలో విహరించేలా చేస్తోంది. 2016 సంవత్సరానికి సంబంధించి 'బిబిసి 100 ఉమెన్'లో సన్నీ లియోన్ కూడా చోటు దక్కించుకుంది. ఈ సందర్భేగా బిబిసీ వరల్డ్ న్యూస్ తో మాట్లాడుతూ.....సన్నీ లియోన తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భేగా భారత్ మీద, బాలీవుడ్ పరిశ్రమలోని పరిస్థితుల మీద సంచలన కామెంట్స్ చేసారు.

## 48 కట్స్: సెన్సార్ బోర్డ్ రికార్డ్....



ఇండియన్ సెన్సార్ బోర్డు రికార్డుల మీద రికార్డులు క్రియేట్ చేస్తోంది. తాజాగా ఓ సినిమా విషయంలో భారీగా కట్స్ సూచించడం హాట్ టాపిక్ అయింది. ఈ మధ్య కొన్ని సినిమాల విషయంలో సెన్సార్ బోర్డు వ్యవహారం వివాదాస్పదం అవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నవాజుద్దీన్ సిద్ధిఖీ మూవీ 'బాబూమోషాయ్ బందూక్‌బాజ్' విషయంలో సెన్సార్ బోర్డు తీరు వివాదాస్పదం అయింది. ఈ చిత్రానికి 48 చోట్ల సీన్లు కట్ చేయాలని ఆదేశించారు. దీంతో షాకైన చిత్ర దర్శక నిర్మాతలు రివైజింగ్ కమిటీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సినిమాకు ఇన్ని కట్స్ సూచించడంపై మీడియా వారు సెన్సార్ బోర్డ్ చీఫ్ నిహ్లానీని ప్రశ్నించగా.. 'నా పని నేను చేస్తున్నా' అని చెప్పి వెళ్లిపోయారట. సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలు ఉన్నాయి కాబట్టే ఇలాంటి నిర?యం తీసుకున్నామని ఆయన చెప్పకనే చెప్పారు.

## 'సాహో'లో బాలీవుడ్ బ్యూటీ ఫైనల్?

'బాహుబలి' ప్రాజెక్టు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్‌ను నేషనల్ స్టార్‌ను చేసింది. 'బాహుబలి' తర్వాత ఆయన నుండి మరో సినిమా ఎప్పుడొస్తుందా? అని తెలుగు అభిమానులతో పాటు ఇండియా వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ నెక్ట్స్ మూవీ 'సాహో' గురించి ఏ చిన్న అప్డేట్ వచ్చినా టాలీవుడ్, బాలీవుడ్... ఇలా అన్ని వుడ్లకు సంబంధించిన ప్రేక్షకులు ఆసక్తిగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ చిత్రంలో హీరో ఎవరు అనే విషయంలో ఇప్పటి వరకు సరైన క్లారిటీ లేదు. మొదట అనుష్కను అనుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్టు చేయడం లేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం 'సాహో'లో బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ఫైనల్ అయిందని, ప్రభాస్ సరసన సుజీత్ దర్శకత్వంలో చేసేందుకు ఆమె సైన్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

అయితే అఫీషియల్‌గా ఈ విషయం ఖరారు కావాల్సి ఉంది. బాహుమలితో ప్రభాస్-అనుష్క జోడీకి మంచి క్రేజ్ ఏర్పడింది. 'సాహో' మూవీకి కూడా ఈ జంటనే కంటిన్యూ చేయాలని అనుకున్నారు కానీ కొన్ని కారణాల వల్ల ఇది సాధ్యం కాలేదు. సాహో యూనిట్ అడిగిన డేట్స్, అనుష్క కమిటైన వేరే సినిమాల డేట్స్ క్లాష్ అవుతుండటంతో వీలు కాలేదని సమాచారం. తాజాగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ఫైనల్ అయినట్లు వార్తలు రావడంతో ప్రభాస్ అభిమానుల్లో ఆనందం నెలకొంది.

శ్రద్ధా కపూర్ మంచి అందగత్తె, టాలెంట్ కలిగిన హీరోయి, ప్రభాస్‌కు బాగా సెట్టవుతుందని అంటున్నారు. సాహో సినిమాను రూ. 150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెలుగు, తమిళం, హిందీలో తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి.




వైజాగ్ : మెలోడి AC 4K DOLBY ATMOS
వైజాగ్ : శ్రీకన్య AC DTS
వైజాగ్ : కామేశ్వరి AC DTS
వైజాగ్ : శారద AC DTS
వైజాగ్ : CMR ఐనాక్స్ AC DTS
వైజాగ్ : వరుణ్ ఐనాక్స్ AC DTS
వైజాగ్ : చిత్రాలయ ఐనాక్స్ AC DTS
వైజాగ్ : ముక్తాస్ ఎ2 ఐనాక్స్ AC DTS
104 ఏరియా : శ్రీలక్ష్మి నరసింహ స్క్రీన్-1 AC DTS
గోపాలపట్నం : శంకర AC DTS
గాజువాక : మోహిని 70MM AC DOLBY ATMOS
గాజువాక : లక్ష్మీకాంత్ AC DTS
శ్రీహరిపురం : S.V.C.లిఖిత AC DTS
షీలానగర్ : STBL
Sc-3 : 4 Shows, Sc-1 : 2Shows(Outdoor)
అచ్యుతాపురం : STBL
Sc-2 : 4 Shows
పెద్దగంట్యాడ : అరుణ AC DTS
కూర్మన్నపాలెం : అన్నపూర్ణ AC DTS
పెందుర్తి : నటరాజ్ స్క్రీన్-1 AC DTS
అనకాపల్లి : రామచంద్ర AC DTS
అనకాపల్లి : మినీ సత్యనారాయణ AC DTS (ప్రారంభ చిత్రం)
యలమంచిలి : శ్రీసీతాచిత్రమందిర్ AC DTS
పాయకరావుపేట: సాయిమహల్ DTS
చోడవరం : శ్రీ సాయిలక్ష్మీ స్క్రీన్-1 AC DTS
దేవరాపల్లి : మహేశ్వరి AC DTS
నర్సీపట్నం : రాజు AC DTS
కొత్తవలస : రాజా AC DTS
విజయనగరం : హిమగిరి AC DTS
విజయనగరం : న్యూపూర్ణ AC DTS
విజయనగరం : NCS ఐనాక్స్ AC DTS
పాందూరు : ఊర్వశి AC DTS
సాలూరు : లక్ష్మీ AC DTS
సోంపేట : శ్రీనివాస DTS
బొబ్బిలి : శ్రీలక్ష్మి AC DTS
పార్వతీపురం : సౌందర్య AC DTS
మాడుగుల : కనకరత్న DTS
పాలకొండ : రామ్‌కళామందిర్ AC DTS
తగరపువలస : గణేష్ AC DTS
నెల్లిమర్ల : శ్రీ శ్రీనివాస DTS
ఇచ్ఛాపురం : మణికంఠ AC DTS
మధురవాడ : దుర్గ DTS
గజపతినగరం : సూర్యమహల్ AC DTS
టెక్కలి : సుదర్శన్ DTS
రాజాం : శ్రీ సీతారామ AC DTS
చీపురుపల్లి : అనురాగ్ AC DTS
కొత్తూరు : ఉమాశంకర DTS
కవిటి : మహాలక్ష్మీ DTS
శ్రీకాకుళం : సరస్వతి AC DOLBY ATMOS
శ్రీకాకుళం : సన్‌మ్యాక్స్ AC DTS
పలాస : అన్నపూర్ణ AC DTS
ఎస్.కోట : శ్రీనివాస AC DTS
నరసన్నపేట : శ్రీవెంకటేశ్వర AC DTS
పాడేరు : వెంకటరమణ DTS
హీరమండలం : వరలక్ష్మి DTS
మందస : మహేంద్ర DTS
గార : శ్రీ సూర్యమహల్ DTS
ఆమదాలవలస : శ్రీదేవిమహల్ DTS
కోటబొమ్మాళి : అనుపమ DTS
పైడిభీమవరం : వెంకటరమణ AC DTS
భోగాపురం : గోపాలకృష్ణ AC DTS
అరకు : జోతి DTS
పాతపట్నం : ఉమామహల్ DTS
కొత్తకోట : రవిటాకీస్ DTS
మాకవారిపాలెం : శ్రీకన్య DTS
తిమ్మాపురం : లక్ష్మీనరసింహ AC DTS
ముక్కువ : పద్మశ్రీ DTS
వీరఘట్టం : బి.ఎం.ఆర్ DTS
బలిజిపేట : రామకృష్ణ DTS
పూసపాటిరేగ : శ్రీసాయికృష్ణ AC DTS
కె.డి.పేట : స్వామిసత్యనారాయణ DTS
జామి : జోతి DTS
దార్లపూడి : వరహా DTS
వేములపూడి : వెంకటవేమ AC DTS
రచ్చ, బెంగాల్‌టైగర్ చిత్రాల దర్శకుడు సంపత్‌నంది అందించిన స్టైలిష్ ఎంటర్‌టైనర్!!



SRI BALAJI CINE MEDIA
సూపర్ హిట్!
SAMPATH NANDI'S
గౌతమ్‌నంద
a journey into the self...
J.BHAGAVAN J.PULLA RAO
రిలీజ్: శ్రీబాలాజీ ఫిలింస్,
50-42-8/1, పి & టి కోలనీ, గురుద్వార దగ్గర, సీతమ్మధార,
విశాఖపట్నం-13 ఫోన్: 2512299, సెల్: 9848982121, 9704089888

# తల్లిపాలు తాగడం బిడ్డల హక్కు

## ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని



విశాఖపట్నంః తల్లి పాలు తాగడం బిడ్డ హక్కని, పాలనందించడం తల్లి బాధ్యత అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీ, అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేశారు. జిల్లా పరిషత్ జంక్షన్ నుండి కలక్టరేట్, పంచాయితీ కార్యాలయం మీదుగా ఆశా, అంగన్వాడీ, ఏఎన్ఎం , నర్సింగ్ విద్యార్థులతో భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో లాలం భవానీ మాట్లాడుతూ తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యంతో పాటు తెలివితేటలు కూడా పెరుగుతాయని, తల్లి పాలలో పోషకాలు పుష్కలంగా వుంటాయని అన్నారు. పుట్టిన బిడ్డకు గంట లోపలే తల్లి పాలు ఇవ్వడం వలన తల్లీ, బిడ్డలకు ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. బాలింతలలో పాల ఉత్పత్తి కోసం పౌష్టికాహారం తల్లులు తీసుకోవాలని, ప్రభుత్వం కూడా అంగన్వాడీల ద్వారా తల్లీ బిడ్డలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందని అన్నారు. తల్లి పాలను బిడ్డకు ఇవ్వడానికి తల్లులు సిగ్గు పడకూడదని, ఆ అవకాశాన్ని భగవంతుని వరంగా భావించాలని హితవు పలికారు. ఉద్యోగాలకు వెళ్లే బాలింతలకు పాలివ్వడం కష్టంగా వుంటుందనే ప్రభుత్వం వారికి మెటర్నిటీ లీవును ఇస్తోందని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య శాఖ, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొని తల్లి పాల వారోత్సవాల్లో తల్లి పాల విశిష్టతను చాటి చెప్పేలా గ్రామగ్రామాన అవగాహన కలిగించాలన్నారు. సభాధ్యక్షత వహించిన ఐసీడిఎస్ పిడి చిన్మయీ దేవి మాట్లాడుతూ ప్రతీ యేటా తల్లి పాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందని, ఈ ఏడాది ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, తల్లి పాల సంస్కృతికి సుస్థిర ప్రోత్సాహం అనే నినాదంతో జరుగుతుందని అన్నారు. పుట్టిన బిడ్డకు గంట లోపల తల్లి పాలిచ్చే వారి సంఖ్య 80 శాతం వరకూ వుందని, మిగిలిన 20 శాతం మందికి తల్లి పాలపై అవగాహన కలిగించి శత శాతం తల్లి పాల వినియోగం జరిగేలా గర్భిణీలకు, బాలింతలకు, యువతులకు మోటివేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చాణుక్య, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు హాజరైనారు.

# అథ్లెటిక్స్‌ను రక్షించండి..

## ఉసేన్ బోల్ట్ ఆవేదన



హైదరాబాద్: క్రీడాకారులు సమష్టిగా బాధ్యత తీసుకుని అథ్లెటిక్స్‌ను కాపాడాలని ఉసేన్ బోల్ట్ అభిప్రాయపడ్డాడు. శుక్రవారం లండన్లో జరుగనున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న బోల్ట్‌కు ఇదే చివరి పరుగు. 2015లో ఓ సమావేశంలో మాట్లాడుతూ 2017లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పరుగు నుంచి నిష్క్రమిస్తానని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బోల్ట్ పాల్గొనబోతున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో బోల్ట్ మాట్లాడుతూ.. ఒక్క ఆటగాడు గెలిచినంత మాత్రాన అథ్లెటిక్స్‌ను బ్రతికించలేడని ఆటగాళ్లంతా సమష్టి బాధ్యత తీసుకుని అథ్లెటిక్స్‌ను కాపాడాలని కోరాడు. ఎవరైనా ఓ ఆటగాడు నిష్క్రమిస్తే తర్వాత అతని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న ప్రశ్న తలెత్తకూడదని.. కచ్చితంగా ఆ ఆటగాడి వారసత్వాన్ని కొనసాగించాలని లేదంటే అథ్లెటిక్స్ మరుగున పడిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశాడు.

400మీటర్ల స్ప్రింట్ ఒలింపిక్స్ స్వర్ణపతాక విజేత వేడ్ గురించి బోల్ట్ మాట్లాడాడు. వేడ్ 24ఏళ్ల యువకుడని.. చాలా వేగంగా పరిగెడుతున్నాడని, కచ్చితంగా తన రికార్డులను బద్దలు కొట్టే సామర్థ్యం వేడ్‌కు ఉందన్నాడు. 100మీటర్లు, 200 మీటర్ల స్ప్రింట్ పోటీల్లోకూడా వేడ్ పాల్గొంటే పరుగు వేగాన్ని పెంచుకునేందుకు ఆస్కారముందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

**ఇప్పుడే మార్పు మొదలైంది**

అథ్లెటిక్స్‌కు క్రీడాకారులు అవసరం ఎంతో ఉందన్నాడు. క్రీడాకారులు వారి క్రీడా జీవితాన్ని తేలికగా తీసుకుంటే దాని వల్ల అథ్లెటిక్స్ మరుగున పడిపోయే ప్రమాదముందని హెచ్చరించాడు. మాదకద్రవ్యాలు తీసుకుని పోటీల్లో పాల్గొంటే అది అథ్లెటిక్స్‌కే అవమానం, ప్రమాదకరమని క్రీడాకారులు ఈ విషయం గురించి ఆలోచించాలన్నాడు.

# అందుకే పాక్‌తో ఆడలేకపోతున్నాం!




కోల్‌కతా: భారత్-పాక్ మధ్య మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ కోసం పాక్ క్రికెట్ బోర్డు తీవ్రంగా ప్రయతిస్తోంది. భారత్-పాక్ సరిహద్దులో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత ప్రభుత్వం ఇరు దేశాల మధ్య మ్యాచ్‌లను నిర్వహణకు విముఖం చూపిస్తోందని గతంలో వార్తలు వచ్చాయి.

తాజాగా బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి దీనిపై పెదవి విప్పారు. ఈ ఏడాది భారత్-పాక్ మధ్య ఎందుకు ద్వైపాక్షిక సిరీస్ నిర్వహించలేకపోతున్నామో వివరించారు. కోల్‌కతాలో బీసీసీఐ పర్యటనల ప్రణాళిక కమిటీ సమావేశం అనంతరం అమితాబ్ చౌదరి మాట్లాడుతూ... భారత్ సొంతగడ్డపై శ్రీలంకతో మూడు టెస్టులు, మూడు వన్డేలు, మూడు టీ-20లు ఆడనుంది. శ్రీలంకతో బిజీ షెడ్యూల్ కారణంగా పాక్‌తో ఆడలేకపోతున్నాం అని తెలిపారు.

సెప్టెంబరు నుంచి డిసెంబరు ఆఖరి వరకు భారత జట్టు మొత్తం 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకతో వరుసగా సిరీస్‌లు ఉన్నాయని ఆయన చెప్పారు.

23 మ్యాచ్‌లకు వేదికలను ఖరారు చేసిన బీసీసీఐ తేదీలను ఇంకా వెల్లడించలేదు. ఆస్ట్రేలియాతో టీ-20కి హైదరాబాద్, శ్రీలంకతో వన్డేకి వైజాగ్ ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే.

# నా కొడుకు తేజస్వీ ఒక్కడే పనిచేశాడు : లాలూ



పట్నా: మహాకూటమికి గుడ్‌బై చెప్పి.. భాజపాతో చేతులు కలిపిన బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌పై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శల వర్షం కొనసాగిస్తూనే ఉన్నారు. మీడియా సమావేశాలు, ట్విటర్.. ఇలా అవకాశం దొరికనప్పుడల్లా నితీశ్‌పై విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి.. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం పనితీరుపై రిపోర్ట్ కార్డు ఇచ్చారు లాలూ. ఈ రెండేళ్లలో నితీశ్ కేబినెట్‌లో తన చిన్న కుమారుడు తేజస్వీ యాదవ్ ఒక్కడే పనిచేశాడని లాలూ అన్నారు. అయితే ఈ సందర్భంలో ఆయన నితీశ్ కేబినెట్‌లోనే ఉన్న తన మరో కుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను కూడా మర్చిపోవడం గమనర్హాం. ఓ మీడియా సమావేశంలో మాట్లాడిన లాలూ.. మరోసారి నితీశ్ అభిప్రాయాన్ని తప్పు బట్టారు. ఈ సందర్భంగా గడిచిన 20నెలల రాష్ట్ర ప్రభుత్వంపై మీ అభిప్రాయమేంటని ఓ విలేకరి లాలూను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన లాలూ.. సగటుగా ఉందని చెప్పారు. అంతేగాక ఒక్క నా కుమారుడు తేజస్వీ మాత్రమే ఇన్నాళ్లు పనిచేశాడు అని చెప్పుకొచ్చారు. అయితే లాలూ మరో కుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ కూడా నితీశ్ కేబినెట్‌లోనే మంత్రిగా పనిచేశారు. తేజ్‌ప్రతాప్‌ను కూడా మర్చిపోవడంతో విలేకరులు కంగుతిన్నారు.

మరో విషయమేంటంటే.. నితీశ్ మహాకూటమి నుంచి విడిపోవడానికి తేజస్వీ యాదవ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలే ముఖ్య కారణం.

# చంద్రబాబు మాయాబజార్ చూపిస్తున్నారు



కర్నూలు: ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు అకస్మాత్తుగా నంద్యాలలో మాయా బజార్ చూపిస్తున్నారని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. ఆయన బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడుతూ... నంద్యాల ఉప ఎన్నికతో టీడీపీ ఊహలు తారుమారు అవుతాయన్నారు. రానున్న రోజుల్లో మరింతగా ఆ పార్టీ ప్రతిష్ట దిగజారుతుందన్నారు.

టీడీపీని గెలిపించకపోతే అభివృద్ధి ఆగిపోతుందని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, వైఎస్‌ఆర్ సీపీ గెలిస్తే అభివృద్ధి ఎందుకు ఆగిపోతుందని అంబటి సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు తన ఇంట్లో నుంచి డబ్బులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారా అని ప్రశ్నలు సంధించారు. నంద్యాల ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని అంబటి కోరారు. ఉప ఎన్నికలో చంద్రబాబు, లోకేశ్‌కు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు.

పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... నంద్యాలలో రేపు (గురువారం) ఎస్పీజీ గ్రౌండ్స్‌లో జరిగే వైఎస్‌ఆర్ సీపీ బహిరంగ సభలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పాల్గొంటారని తెలిపారు. వైఎస్‌ఆర్ సీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ఈ నెల 4న నామినేషన్ దాఖలు చేస్తారన్నారు.

అలాగే జగన్ సమక్షంలో శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీలో చేరతారని చెప్పారు.

# జిల్లాలో రాష్ట్ర షెడ్యూల్డు తెగల ఎస్‌టి సంక్షేమ కమిటీ రెండు రోజుల పర్యటన

విశాఖపట్నంః రాష్ట్ర షెడ్యూల్డు తెగల సంక్షేమ కమిటీ (ఎపిఎల్‌ఎ) చైర్మన్ ఎం. శ్రీనివాసరావుతో కూడిన 10మంది ఎంఎల్‌ఎ బృందం ఈ నెల 3, 4 తేదీలలో విశాఖలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 9.30 నిముషాలకు సింహాచలంలో పర్యటించి దేవస్థాన ఇఓ మరియు సంబంధిత అధికారులతో సమావేశమవుతారు. 11.00 గంటలకు ప్రభుత్వ అతిధి గృహంలో షెడ్యూల్డు తరగతులకు చెందిన ప్రతినిధుల నుండి వినతులను స్వీకరిస్తారు.

అనంతరం 11.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో వారి వారి శాఖలలో రిజర్వేషన్ అమలు తీరుపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు నగరంలో గల ఎస్‌టి హాస్టళ్లను సందర్శిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి అరకు చేరుకుని రాత్రి బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు అరకు నుండి బయలు దేరి 10.30కు పాడేరు చేరుకుని ఎస్‌టి ఆర్గనైజేషన్‌ల నుండి వినతి పత్రాలను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఐటిడిఎ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమవుతారు. అంతరం 2.30 గంటలకు పాడేరులో ఎస్‌టి హాస్టళ్లను సందర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఎవెల్‌ఎ బృందం పాడేరు నుండి బయలుదేరి విశాఖపట్నం చేరుకుని రాత్రి ఫలక్‌నామ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి విజయవాడ వెళతారు.

# శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి లఖ్‌నవూ వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ నుంచి నాలుగు బోగీలు వేరు పడిన ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ వూపిరి పీల్చుకున్నారు. యూపీలోని అలీఘర్ జిల్లా కుర్జా స్టేషన్ సమీపంలో ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇంజిన్ నుంచి వేరుపడిన నాలుగు బోగీలు అక్కడే నిలిచిపోగా.. మిగిలిన బోగీలు, ఇంజిన్ కొంతదూరం పాటు ప్రయాణించాయి. అనంతరం మళ్లీ రైలుకు యథావిధిగా బోగీలను అనుసంధానించడంతో రైలు తిరిగి బయల్దేరింది. ఈ ఘటన కారణంగా రైలు అరగంట ఆలస్యమైంది.






# ఫ్యాకల్టీ క్లబ్ అధ్యక్షునిగా ఆచార్య పి.విశ్వనాథం

## కార్యదర్శిగా డాక్టర్ పేటేటి ప్రేమానందం

## అభినందించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్ర విశ్వవిద్యాలయంః ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ క్లబ్ అద్యక్షునిగా కామర్స్ మేనేజ్‌మెట్ విభాగ ఆచార్యులు, ఏయూ ఆర్ట్స్ కళాశాల హాస్టల్స్ పూర్వ చీఫ్ వార్డెన్ ఆచార్య పి.విశ్వనాథం ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎల్.డి సుధాకర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యదర్శిగా డాక్టర్ పేటేటిప్రేమానందం (పాలిటికల్ సైన్స్), కోశాధికారిగా ఆచార్య డి.అప్పల నాయుడు (కెమికల్ ఇంజనీరింగ్), ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధిగా ఆచార్య ఎల్.ఎస్.వి ప్రసాద్, సైన్స్, ఫార్మశీ ప్రతినిధిగా డాక్టర్ పి.వి లక్ష్మీ నారాయణ (న్యూక్లియర్ ఫిజిక్స్), ఆర్ట్స్ కళాశాల ప్రతినిధిగా డాక్టర్ కె.రమేష్ బాబు (యోగా) ప్రత్యేక సభ్యునిగా విశ్రాంత ఆచార్యులు ఆచార్య టి.తిమ్మారెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం రెండు సంవత్సరాలు పదవిలో ఉంటారు. నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com